
# ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

## పల్నాడు జిల్లా వార్తలు




శనివారం 19 అక్టోబరు 2024



- బడుల్లో మెరుగైన పరిశుభ్రతకు ప్రణాళిక
- ప్రత్యేకంగా యాప్, ప్రతీ కమిటీకి గుర్తింపు సంఖ్య
- ప్రతి బుధ, శుక్రవారాల్లో కమిటీ సభ్యులు పనుల పరిశీలన
- మరుగుదొడ్ల మరమ్మతులకూ సత్వర పరిష్కారాలు
- గత ప్రభుత్వంలో ఉపాధ్యాయులకు ఆ బాధ్యతపై విమర్శలు



## పారిశుధ్యం.. స్కూల్ మేనేజ్‌మెంట్లకు

మున్సిపల్ స్కూల్

8

## కొనసాగుతున్న నీటి విడుదల



- సాగర్ నుంచి ఆరు క్రస్ట్ గేట్ల ద్వారా దిగువకు

## పెళ్లిని అంగీకరించలేదని.. ప్రేమికుల ఆత్మహత్య

- కులాంతర వివాహాన్ని వ్యతిరేకించిన కుటుంబ పెద్దలు
- రైలు కింద పడిన ప్రేమ జంట



మృతులు దానబోయిన మహేష్ (22), నంద్రు శైలజ (20)

6

## ప్రత్యేక రైళ్ల ద్వారా బాదేందుకేనా..

- రైల్వే టిక్కెట్ల అడ్వాన్స్ రిజర్వేషన్ కాలం తగ్గింపుపై ప్రయాణికుల సందేహం
- రైల్వే చూపుతున్న కారణాలు సహేతుకంగా లేవని వాదన



సందడి లేని అన్నవరం గ్రామం



# ఊరే వృద్ధాశ్రమం

8

- ఉద్యోగాల కోసం పిల్లలు వలస
- అక్కడ ఇమడలేక.. ఇక్కడ ఉండలేక
- గ్రామాల్లో ఒంటరిగా పండుటాకులు

పాపం పండుటాకులు.. పలకరించేవారు లేరు. బాగోగులు చూసేవారు లేరు. తిన్నావా అని అడిగేవారు లేరు. కొన్నిళ్లల్లో వృద్ధ జంటలు. మరి కొన్నిళ్లలో ఒంటరి మహిళలు.. ఒంటరి పురుషులు. కావాల్సినంత డబ్బు. సకల సౌకర్యాలు. మంచిమంచి భవనాలు. అన్నీ ఉన్నా.. దిగాలు. ఇదీ గ్రామాల్లోని పరిస్థితి. ఆర్థిక స్తోమత లేకపోయినా పిల్లల్ని బాగాచదవించి.. రెక్కల కష్టంతో అమెరికా పంపి వారు ఉన్నతంగా స్థిరపడేలా చేశారు. దూరతీరాల్లో ఆర్థికంగా ఎదిగిన పిల్లల్ని చూసి సంబరపడ్డారు. అయితే ఇంతవరకు బాగున్నా.. వృద్ధాప్యంలో తమ పరిస్థితి తలచుకుని కన్నీటి పర్యంతమవుతున్నారు. పిల్లల దగ్గరకు వెళ్లి ఉండలేక.. ఇక్కడ ఒంటరిగా ఉండలేక.. అనేకమంది వృద్ధులు సతమతమవుతున్నారు. తమ పిల్లలు గురించి గొప్పలు చెప్పుకున్న వారే.. ఇప్పుడు తమ పరిస్థితి మరెవ్వరికీ రాకుడదని మొక్కుకుంటున్నారు. రెక్కలు వచ్చిన పిల్లలు దూర ప్రాంతాలకు ఎగిరిపోగా వృద్ధులతో నిండిపోయిన ఇళ్లతో పలు పల్లెలు వృద్ధాశ్రమాలను తలపిస్తున్నాయి.

### పిల్లల దగ్గర ఉండలేక..

గ్రామానికి చెందిన ఓ వృద్ధురాలు ఒంటరిగా ఉండలేక బెంగళూరులోని కుమారుడి వద్దకు వెళ్లింది. వెళ్లిన రెండ్రోజులు బాగానే ఉంది. ఆ తర్వాత నుంచి కోడలి నస మొదలైంది. ఇల్లు సరిపోవడం లేదని మొఖం నల్లగా పెట్టడంతో ఆమె అక్కడ ఉండలేకపోయింది. దీంతో తిరిగి ఇంటికి చేరుకుంది. కావాలంటే ఇంకో పదివేలు ఎక్కువ పంపుతాను అక్కడే సర్దుకోమని ఆమెకు కుమారుడు చెప్పాడు. అంత వయస్సు వచ్చిన కొడుక్కి అర్థం కానిది ఏమిటంటే ఈ వయసులో అమ్మకి కావలసింది నోట్లు కాదు.. తిన్నావా.. లేదా.. అని ప్రేమతో పలకరించే నోర్లు అని. ఇప్పుడు లంకంత కొంపలో ఆమె ఒక్కతే చరిత్రకు సాక్షిలా ఉంది. ఇదే పరిస్థితి గ్రామానికి చెందిన మరో వృద్ధుడిది. అందరూ మామా అంటారు. ఉన్న ఒక్క కూతురుకి వివాహం చేసేశాడు. వయసు మీదపడినా పిల్లనిచ్చిన దగ్గరకి వెళ్లి ఉండలేకపోతున్నాడు. ఒంటరి బతుకు తప్పడం లేదు మరి. ఇలాంటి పరిస్థితి గ్రామంలోని ప్రతీ గడపలోనూ కనిపిస్తోంది.



# ధాన్యం సేకరణ.. సరికొత్తగా

- జిల్లాల వారీగా లక్ష్యాలు పెంపు
- సత్వరమే నగదు చెల్లించేలా ప్రణాళికలు
- నూతనంగా మార్గదర్శకాలు జారీ చేసిన ప్రభుత్వం
- అన్నదాతల ప్రయోజనాలు కాపాడడమే అంతిమ లక్ష్యం
- ఇష్టమైన మిల్లులకే ధాన్యం రవాణా చేసుకునే వెసులుబాటు
- గత ప్రభుత్వంలో దారుణంగా పడిపోయిన సేకరణ

పిడుగురాళ్ల, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): ప్రహసనాన్ని తలపించిన ధాన్యం సేకరణ.. అలవికాని నిబంధనలు.. మిల్లర్ల మాయాజాలం.. డబ్బులు కోసం కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన దుస్థితి.. చెల్లింపులు సంగతి అయితే చెప్పక్కర్లేదు.. నిలువునా మోసాలు.. ఇదీ ఐదేళ్ల వైసీపీ పాలనలో ధాన్యం సేకరణ తీరు. ఇక ప్రకృతి విపత్తులు సంభవించినప్పుడు నిబంధనలు సడలించి ధాన్యాన్ని సేకరిస్తామనే ఊరడింపు మాటలు తప్పితే ఆచరణలో అమలైన దాఖలాలే లేవు. ఈ పరిస్థితుల్లో అన్నదాతల కష్టాలను గట్టెక్కించేందుకు కూటమి ప్రభుత్వం సిద్ధమైంది. గత ప్రభుత్వం నిలకడలేని నిర్ణయాలతో అన్నదాతలను తీవ్ర ఇబ్బందులకు గురిచేయగా కూటమి ప్రభుత్వం సరికొత్తగా సేకరణకు సిద్ధమైంది. ధాన్యం సేకరణలో గత ప్రభుత్వ హయాంలో నెలకొన్న బాలారిష్టాలన్నింటికి చరమగీతం పాడి ధాన్యానికి మద్దతు ధర పొందడం అనేది రైతు హక్కుగా చేసి వారికి న్యాయంచేయడానికి కూటమి ప్రభుత్వం నడుం బిగించింది. ఖరీఫ్ నుంచే మార్చిన మార్గదర్శకాలను అమల్లోకి తేవడంతోపాటు రైతుల ఖాతాల్లో నగదును వెంటనే జమచేసేలా ప్రణాళికలు రచిస్తోంది. ఈ క్రమంలో త్వరలో చేపట్టబోయే ధాన్యంసేకరణను సరికొత్తగా పట్టాలెక్కించడానికి అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు.

### బాపట్ల జిల్లాలో అత్యధికంగా..

ఖరీఫ్‌లో వరిసాగు అత్యధికంగా బాపట్ల జిల్లాలో దాదాపు 2.15 లక్షల ఎకరాల్లో సాగవుతూ ఉండగా దిగుబడి అంచనాలు 5.50 లక్షల టన్నులుగా ఉంది. ఉమ్మడి గుంటూరు జిల్లావ్యాప్తంగా చూస్తే వరిసాగు గతంలో దాదాపుగా 1.65 లక్షల హెక్టార్లలో సాగవుతూ వస్తోంది. ఈ ఖరీఫ్ సీజన్‌లో ధాన్యం సేకరణ లక్ష్యం బాపట్ల జిల్లాలో 50,000 మెట్రిక్ టన్నులు కాగా, గుంటూరు జిల్లాలో 10,000 టన్నులు, పల్నాడు జిల్లాలో 5,000 టన్నులు సేకరించాలని యంత్రాంగం నిర్దేశించుకుంది. గతంలో ధాన్యం సేకరణలో రైసుమిల్లుల యాజమాన్యాలు అన్నదాతలను తీవ్ర ఇక్కట్లకు గురిచేసేవారు. ఇక మీదట మిల్లుల ర్యాండమైజేషన్ ప్రక్రియను రద్దు చేసి అన్నదాతలు తమకు ఇష్టమైన మిల్లులకే ధాన్యం తరలించుకునే వెసులుబాటును కూటమి ప్రభుత్వం కల్పించింది. గతంలో మిల్లులకు తీసుకెళ్లిన ధాన్యం విషయంలో రైతులు గంటల తరబడి నిరీక్షించాల్సి వచ్చేది. రైతుల ఇక్కట్లకు స్వస్తి పలికే విధంగా ప్రతి మిల్లుకు ఓ ఉద్యోగిని పరిశీలకుడుగా నియమించి అటు అన్నదాతలకు ఇటు అధికారులకు ఎప్పటికప్పుడు సమాచారం చేరవేసేలా నిర్ణయం తీసుకుంది. గతంలో ధాన్యం డబ్బులు సకాలంలో జమకాక అన్నదాతలు పడిన ఇబ్బందులు అన్నీఇన్నీకావు. ఇకపై ఇలాంటి ఎదురుచూపులకు ఆస్కారం లేకుండా ధాన్యం అమ్మిన వారం రోజుల్లోనే రైతుల ఖాతాల్లో డబ్బులు జమయ్యేలా కూటమి ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది.

### లక్ష్యాలు చేరుకోవాల్సిందే...

గత ప్రభుత్వంలో ధాన్యం సేకరణ లక్ష్యం కేవలం అంకెలకే పరిమితమయ్యేది. పైగా బహిరంగ మార్కెట్‌లో ధర ఎక్కువగా ఉండడం వల్ల కొనుగోలు కేంద్రాలకు ధాన్యం రావడం లేదనే సమర్థనను కూడా అధికారులు ఇచ్చుకునేవారు. కానీ క్షేత్రస్థాయి పరిస్థితులు మాత్రం అందుకు భిన్నంగా ఉండేవి. అలవిమాలిన నిబంధనల చట్రానికి తోడు నగదు చెల్లింపులో గత ప్రభుత్వం అవలంభించిన నిర్లక్ష్య ధోరణే సేకరణకు ప్రతిబంధకాలుగా ఉండేవి. గత్యంతరం లేని పరిస్థితుల్లో దళారులకు తక్కువ ధరకు ధాన్యాన్ని అమ్ముకున్న రైతన్న తీవ్రంగా నష్టపోయేవారు. ఈ పరిస్థితుల్లో ఈ సీజన్ నుంచి ఏ కారణంతోనూ మద్దతు ధరకు ధాన్యం కొనుగోలును యంత్రాంగం నిరాకరించకూడదని ఆదేశించింది. నిబంధనల విషయంలో ఉదారంగా వ్యవహరించాలని నిర్దేశించింది. జిల్లాల వారీగా త్వరలో ప్రారంభమయ్యే ఖరీఫ్ ధాన్యం సేకరణ లక్ష్యాలను యంత్రాంగం చేరుకోవాల్సిందేననే స్పష్టమైన ఆదేశాలను జారీ చేసింది

### గతంలో లక్ష్యంలో సగం కూడా చేరుకోలేక..

వైసీపీ ప్రభుత్వ అస్తవ్యస్త విధానాల వల్ల గడచిన మూడేళ్లలో ధాన్యం సేకరణ ఏటికేడు కుచించుకుపోయింది. 2022--23 ఆర్థిక సంవత్సరానికి ఖరీఫ్ సీజన్‌లో బాపట్ల జిల్లాలో సేకరించిన ధాన్యం 40 మెట్రిక్ టన్నులు కాగా అది గతేడాది 32,000కు పడిపోయింది. ఇక గుంటూరు, పల్నాడు జిల్లాల్లోనూ విధించుకున్న లక్ష్యాలకు సేకరణకు పొంతనలేని పరిస్థితి. గడచిన ఆర్థిక సంవత్సరం ఖరీఫ్‌కు గుంటూరు జిల్లాలో 15,000 మెట్రిక్ టన్నులు లక్ష్యం పెట్టుకోగా అది 4,000 మెట్రిక్ టన్నులకే పరిమితమైంది. ఇక పల్నాడు జిల్లాలో పెట్టుకున్న లక్ష్యం పదివేల టన్నులు కాగా 5,000 మెట్రిక్ టన్నులకే అది కుచించుకుపోయింది ఇలా ఏటికేడు సేకరణ లక్ష్యాలకు ముగింపు లెక్కలకు సంబంధం లేకుండా ధాన్యాన్ని సేకరించి మమ అనిపించి గత ప్రభుత్వం చేతులు దులుపు కునేది.

# రీ సర్వే ప్రక్షాళన

- చర్యలు చేపట్టిన ప్రభుత్వం
- రెవెన్యూ గ్రామసభలు ప్రారంభం
- బాధితుల నుంచి అధికారులు అర్జీల స్వీకరణ

నరసరావుపేట, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): వైసీపీ ప్రభుత్వ హయాంలో 'శాశ్వత భూహక్కు-భూరక్ష' పేరుతో భూరీసర్వే నిర్వహించిన విషయం తెలిసిందే. ఆ రీసర్వే తప్పుల తడకగా జరగడం, వివాదాల నేపథ్యంలో తమ భూములను సర్వే చేసి న్యాయం చేయాలని రైతుల విజ్ఞప్తులు, ఆందోళనలను నాటి ప్రభుత్వం లక్ష్య పెట్టలేదు. అయితే, రైతుల ఆవేదనను గుర్తించిన కూటమి ప్రభుత్వం రీ సర్వేలో జరిగిన పొరపాట్లను సరిదిద్దేందుకు చర్యలు చేపట్టింది. ఈ నేపథ్యంలో జిల్లా వ్యాప్తంగా రీసర్వే పూర్తయిన గ్రామాల్లో శుక్రవారం నుంచి రెవెన్యూ గ్రామ సభలు ప్రారంభమయ్యాయి. తహసీల్దారు, డిప్యూటీ తహసీల్దారు, రీసర్వే డీటీలు, ఆర్ఐ, మండల, గ్రామ సర్వేయర్లు, వీఆర్వోలతో బృందాలుగా ఏర్పడి రీసర్వే జరిగిన గ్రామాల్లో సభలు నిర్వహిస్తున్నారు. సర్వే సమస్యలపై వచ్చిన అర్జీలను పరిశీలించి 15 రోజుల్లో పరిష్కరించేలా సదరు అధికారులు చర్యలు తీసుకోనున్నారు.

### సాంకేతిక లోపాలతో అవస్థలు..

'శాశ్వత భూహక్కు-భూరక్ష' పేరుతో నిర్వహించిన రీసర్వేలో సాంకేతిక లోపాల కారణంగా రిజిస్ట్రేషన్లు నిలిచి పోవడం, రెవెన్యూ, సర్వే, రిజిస్ట్రేషన్ల శాఖల సమన్వయ లోపంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. భూ విస్తీర్ణంలో తేడాలు, ఖాతానంబర్లు తప్పుగా ఉండటం, పట్టా భూములు ప్రభుత్వ భూములుగా నమోదు, భూవిస్తీర్ణంలో తేడాలు.. మెట్ట భూములు, మాగాణిగా మారడంతో రైతులు ఆవేదన చెందారు. దశాబ్దాల కాలంగా ఉన్న సర్వే నంబర్ల స్థానంలో ల్యాండ్ పార్సిల్ మ్యాప్ తీసుకొచ్చారు. కొన్ని సర్వేనంబర్లు పూర్తిగా గల్లంతయ్యాయి. ఆన్‌లైన్‌లో అడంగళ్ కాపీలు కనుమరు గయ్యాయి. భూములకు పునాదులుగా ఉన్న ఆర్ఎస్ఆర్ అదృశ్యం చేసే ప్రయత్నం కూడా చేశారు. ఈ కష్టాలన్నీ తీరేలా గ్రామ సభలను కూటమి ప్రభుత్వం నిర్వహిస్తుండగా బాధితులు అర్జీలతో బారులు తీరుతున్నారు.





నరసరావుపేట మండలం దొండపాడు గ్రామసభలో అర్జీలు అందజేస్తున్న రైతులు

# గుంటూరులో డ్రగ్స్ కలకలం

- 66 గ్రాముల ఎండీఎంఏ స్వాధీనం.. ఇద్దరి అరెస్టు
- బెంగళూరు.. గుంటూరు వయా హైదరాబాద్‌కు రవాణా
- సప్లయర్, వినియోగదారుల కోసం పోలీసుల గాలింపు

గుంటూరు, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): గుంటూరులో మళ్లీ డ్రగ్స్ కలకలం రేపింది. ప్రమాదకరమైన ఎండీఎంఏ డ్రగ్‌ను గుం టూరులో పోలీసులు గుర్తించారు. ఇద్దర్ని అరెస్టు చేసి 5లక్షల ఖరీదైన 66 గ్రాముల డ్రగ్‌ను స్వాధీనం చేసుకున్నారు. బెంగళూరు నుంచి గుంటూరుకు తర లించి ఇక్కడి నుంచి హైదరాబాద్‌కు పంపేందుకు సిద్ధమైన క్రమంలో ఇన్నర్‌రింగ్‌రోడ్డుకు చెందిన షేక్ యూసుఫ్ షరీఫ్‌ను, లాడ్జిసెంటర్‌లోని ఏఎల్ బీఈడీ కళాశాల కాంపౌండ్‌లో ఉండే బట్టు డోనాల్డ్ అలి యాస్ టోనీలను పోలీసులు అరెస్టుచేశారు. డ్రగ్స్‌ను హైదరాబాద్‌కు పంపేందుకు ఆర్టీసీ బస్టాండ్ ఎదురుగా ప్రైవేట్ ట్రావెల్స్ బస్సుకోసం వేచిఉండగా కొత్తపేట పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఈ మేరకు శుక్రవారం కేసు వివరాలను ఎస్పీ సతీష్‌కుమార్ మీడియాకు వివరించారు. యూసుఫ్ షరీఫ్ గతంలో బెంగళూరులో ఉద్యోగం చేసే ప్రాంతంలో పరిచయమైన వ్యక్తి ద్వారా ఎండీఎంఏ డ్రగ్ అలవాటైంది. ఆ తర్వాత అక్కడ ఉద్యోగం మానేసిన యూసుఫ్ కొంతకాలం విదేశాల్లో ఉన్నారు. తిరిగి గుంటూరుకు వచ్చి ప్రస్తుతం ఖాళీగా ఉంటున్నాడు. ఈ క్రమంలో బెంగళూరు గతంలో పరిచయమైన వ్యక్తి ద్వారా డ్రగ్స్ తెప్పించుకుని డీజే ఈవెంట్ ఆర్గనైజరైన డోనాల్డ్‌తో కలిసి వినియోగిస్తున్నాడు. హైదరాబాద్‌లోని స్నేహితులు డ్రగ్ తెప్పించమని రూ.లక్ష యూసుఫ్ షరీఫ్‌కు పంపారు. ఈ క్రమంలో బెంగళూరులోని తన స్నేహితుడికి రూ.75 వేలు పంపగా ఈ నెల 16న ఓ ప్రైవేట్ ట్రావెల్స్ బస్సులో గుంటూరుకు పంపాడు. అందులో కొంచెం డోనాల్డ్‌కు ఇచ్చి మిగిలిన డ్రగ్‌ను హైదరాబాదులోని స్నేహితులకు ఇచ్చేందుకు సిద్ధమవగా కొత్తపేట సీఐ ఎం వీరయ్యచౌదరి ఆధ్వర్యంలో సిబ్బంది దాడి చేసి వారిని అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి ఐదు లక్షల ఖరీదైన 66.26 గ్రాముల ఎండీఎంఏ డ్రగ్‌తో పాటు నాలుగు స్మార్ట్ ఫోన్లు, ఐప్యాడ్, పోర్టబుల్ ఎలక్ట్రానిక్ వేయింగ్ మిషన్, డ్రగ్స్ పీల్చడానికి ఉపయోగించే ట్యూబులు స్వాధీనం చేసుకున్నారు. నిందితులను కోర్టులో హాజరుపరచగా రిమాండ్ విధించినట్లు ఎస్పీ తెలిపారు.



నిందితుల నుంచి స్వాధీనం చేసుకున్న డ్రగ్స్, పరికరాలు, సెల్ ఫోన్‌లు



స్వాధీనం చేసుకున్న డ్రగ్స్ వినియోగించే పరికరాలను పరిశీలిస్తున్న ఎస్పీ సతీష్‌కుమార్, పక్కన డీఎస్పీ అజీజ్, సీఐ వీరయ్యచౌదరి

# మునిసిపాలిటీలకు.. అధికారులు కావలెను

- సిబ్బంది కొరతతో కుంటుపడుతున్న పురపాలన
- పరిష్కారం కాని ప్రజా సమస్యలు
- బదిలీలు జరిగినా జరగని నియామకాలు
- చోద్యం చూస్తున్న మునిసిపల్ శాఖ

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి) పల్నాడు జిల్లా పురపాలక సంఘాల్లో అధికారుల కొరత నెలకొంది. బదిలీల ప్రక్రియ పూర్తయినా పలు మునిసిపాల్టీలలో అధికారుల నియమాకాలు జరగలేదు. సిబ్బంది కొరతలో పట్టణాల్లో పాలన కుంటుపడుతోంది. ప్రజాసమస్యలు పరిష్కారానికి నోచుకోవడంలేదు. ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయాల్సిన మున్సిపల్‌శాఖ చోద్యం చూస్తోందన్న విమర్శలున్నాయి. మునిసిపాల్టీలకు అధికారులను నియమించినా కొందరు విధుల్లో చేరలేదు. కొందరు అధికారులను విధుల్లో చేరకుండా అధికార పార్టీ నేతలు అడ్డుకున్నారు. వెరసి మునిసిపాల్టీల్లో పోస్టులు ఖాళీగా ఉన్నాయి. అత్యంత కీలకమైన ప్రణాళిక విభాగాలు ఖాళీగా ఉన్నాయి. దీంతో యథేచ్ఛగా అక్రమ నిర్మాణాలు సాగుతున్నాయి. పారిశుధ్య విభాగంలోనూ ఖాళీలు ఉండటంతో పరిశుభ్రత పనుల పర్యవేక్షణ కొరవడుతోంది. మాచర్ల మునిసిపాల్టీలో పరిస్థితి అత్యంత దారుణంగా ఉంది. ఇక్కడ సగం పోస్టులు ఖాళీగా ఉండటం గమనార్హం.

జిల్లా కేంద్రం నరసరావుపేట మునిసిపాల్టీలో కీలక పోస్టులు భర్తీకి నోచుకోవడంలేదు. ప్రణాళికా విభాగంలో అధికారులు పోస్టులు ఖాళీగా ఉన్నాయి. టీపీవో, టీపీఎస్, టీపీబీవో పోస్టులు భర్తీ చేయలేదు. పట్టణంలో ఇష్టారాజ్యంగా అక్రమ కట్టడాలు జరగుతున్నాయి. వీటిపై చర్యలు తీసుకుంటున్న దాఖలాలు లేవు. టీపీవోగా ఏ సాంబయ్యను నియమించారు. రాజకీయ కారణాలతో అయనను విధుల్లో చేర్చుకోలేదు. మున్సిపల్ ఇంజనీరింగ్ విభాగంలో మూడు ఏఈల పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఇటీవల బదిలీల్లో ఒక ఏఈని నియమించనప్పటికీ విధుల్లో చేరలేదు. పరిపాలనలో కీలకమైన మేనేజర్ పోస్టు భర్తీకాలేదు. ఇక్కడ మేనేజర్ పొదిలి కమిషనర్‌గా బదిలీ అయ్యారు. రెవెన్యూ విభాగంలో నలుగురు ఆర్ఐలకు ఒకరు మాత్రమే ఉన్నారు.

మాచర్ల మునిసిపాల్టీలో 112మంది ఉద్యోగులు ఉండాల్సి ఉండగా, వీటిలో 53 పోస్టులు ఖాళీగా ఉన్నాయి. రెవెన్యూ అధికారి, బిల్లు కలెక్టర్లు నాలుగు పోస్టులు భర్తీ చేయలేదు. కార్యాలయ మేనేజర్, అకౌంటెంట్‌లు, డిప్యూటీ ఇంజనీరు, జూనియర్ ఇంజనీరు, ప్రణాళికా విభాగం సూపర్‌వైజర్, టీపీబీవోలు, హెల్త్ అసిస్టెంట్, సర్వేయర్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. అధికారుల పోస్టులతో పాటు కార్యాలయ సిబ్బందిని నియమించడంలేదు. దీంతో మాచర్లలో మునిసిపాల్టీలో ప్రజా సమస్యలు పరిష్కారం అయ్యే పరిస్థితులు లేవు.

చిలకలూరిపేట మునిసిపాల్టీలో కూడా ముఖ్య విభాగాల్లో అధికారుల భర్తీ చేయడంలేదు. అత్యంత కీలకమైన ప్రణాళికా విభాగంలో అధికారుల పోస్టులు అన్ని ఖాళీగా ఉన్నాయి. ప్రణాళికా విభాగం అధికారి(టీపీవో), టౌన్‌ప్లానింగ్ సూపర్‌వైజర్, టీపీబీవోల పోస్టులు, ఏఈ పోస్టులు రెండు, హెల్త్ అసిస్టెంట్ పోస్టు ఖాళీగా ఉంది. ఇటీవల జరిగిన బదిలీల్లో కూడా ఈ పోస్టులను భర్తీ చేయలేదు.

దాచేపల్లి మునిసిపాల్టీలో ముఖ్యమైన అధికారులను నియమించలేదు. ప్రణాళికా విభాగంలో ఒక్క పోస్టు కూడా భర్తీకాలేదు. టీపీవో, టీపీఎస్, టీపీబీవోలు ఖాళీగా ఉన్నాయి. రెవెన్యూ అధికారి, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్, శానిటరీ సూపర్‌వైజర్, శానిటరీ ఇన్‌స్పెక్టర్, ఏఈ, హెల్త్‌అసిస్టెంట్, గణాకవిభాగం అధికారులు, కార్యాలయ సిబ్బందిని నియమించలేదు. దాచేపల్లిలో పారిశుధ్య పనులు పర్యవేక్షించే అధికారులే లేరు.

గురజాల మునిసిపాల్టీకి ఇటీవల జరిగిన బదిలీల్లో కనీసం కమిషనర్‌ను కూడా నియమించలేదు. పిడుగురాళ్ల డీఈ ఇన్‌ఛార్జ్ కమిషనర్‌గా పనిచేస్తున్నారు. రెగ్యులర్ కమిషనర్‌ను నియమించే విషయంలో మునిపల్‌శాఖ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందన్న విమర్శలున్నాయి. ఇక్కడ శానిటరీ ఇన్‌స్పెక్టర్, ప్రణాళికా విభాగం అధికారి, గణాంక అధికారి పోస్టులు ఖాళీగా ఉన్నాయి. పిడుగురాళ్ల మునిసిపాల్టీలో మేనేజర్ పోస్టు భర్తీ చేయలేదు. వినుకొండ మునిసిపాల్టీలో ఏఈ పోస్టు ఖాళీగా ఉంది. సత్తెనపల్లి మునిసిపాల్టీలో రెవెన్యూ అధికారి పోస్టు ఖాళీగా ఉంది. ఇక్కడి ఆర్వో దాచేపల్లి కమిషనర్‌గా బదిలీపై వెళ్లారు. టీపీవో పోస్టు కూడా ఖాళీగా ఉంది.



## లారీ ఢీకొని ఇద్దరు మృతి

తాడికొండ, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): బైక్‌ను లారీ ఢీకొట్టడంతో ఇద్దరు మృతి చెందిన సంఘటన శుక్రవారం నిడుముక్కల గ్రామంలో జరిగింది. పోలీసుల కథనం మేరకు.. తుళ్లూరు గ్రామ పంచాయతీలో కార్మికులుగా పనిచేస్తున్న కంతేటి ఏసు (63), బత్తుల అయ్యప్పస్వామి(45) ద్విచక్ర వాహనంపై నిడుముక్కల గ్రామంలో ఓ ఫంక్షన్‌కు వెళ్లి ఇంటికి తిరిగి బయలు దేరారు. నిడుముక్కల- తాడికొండ అడ్డరోడ్డు మధ్యలోకి రాగానే గుంటూరు నుంచి అమరావతి వెళ్తున్న లారీ ఎదురుగా బైక్‌ను ఢీకొట్టడంతో ఇద్దరి తలలకు తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతి చెందారు. అయ్యప్పస్వామికి భార్య కుమాడు, కుమార్తె ఉన్నారు. ఏసు భార్య ఇటీవల మృతి చెందారని, ఆయనకు ఇద్దరు కుమార్తెలు, కుమారులు ఉన్నారని పోలీసులు తెలిపారు. తాడికొండ సీఐ కె.వాసు సంఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించారు. పోస్టుమార్టం నిమిత్తం గుంటూరు జీజీహెచ్‌కు తరలించారు.

# పెళ్లిని అంగీకరించలేదని.. ప్రేమికుల ఆత్మహత్య

- కులాంతర వివాహాన్ని వ్యతిరేకించిన కుటుంబ పెద్దలు
- రైలు కింద పడిన ప్రేమ జంట

పెదకాకాని, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): ప్రేమ పెళ్లిని పెద్దలు అంగీకరించలేదన్న మనస్తాపంతో ప్రేమికులు ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండల కేంద్రమైన పెదకాకానిలోని నంబూరు రైల్వే స్టేషన్ సమీపంలో రైల్వే పట్టాలపై గురువారం రాత్రి జరిగింది. రైల్వే పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. పెదకాకాని యాదవపాలెంకు చెందిన దానబోయిన సాంబశివరావు చిన్న కుమారుడు దానబోయిన మహేష్ (22) డిగ్రి వరకు చదువుకున్నాడు. ఎన్టీఆర్ జిల్లా నందిగామ మండలం రుద్రవరం గ్రామానికి చెందిన నంద్రు వెంకయ్య కుమార్తె శైలజ చదువుకుని ఉద్యోగం నిమిత్తం హైదరాబాద్ వచ్చింది. హైదరాబాదు ఓ ప్రైవేట్ సెల్‌ఫోన్ కంపెనీలో ఇద్దరికీ ఉద్యోగాలు వచ్చాయి. ఇద్దరూ ఒకే కంపెనీలో పని చేస్తున్న క్రమంలో వారిద్దరి మధ్య పరిచయం ఏర్పడి అది ప్రేమగా మారింది. వారి ప్రేమ వ్యవహారాన్ని ఇరువురి కుటుంబ పెద్దలకు తెలియజేశారు. ఈ క్రమంలో ఇద్దరూ హైదరాబాద్‌లో ఉద్యోగాన్ని వదులుకొని గుంటూరు వచ్చారు. ఇరువురి కుటుంబాలకు తెలియకుండా గుంటూరు వచ్చి నివాసం ఉన్నారు. మహేష్ సెల్‌ఫోన్ కంపెనీలో ఉద్యోగం చేస్తుండగా, శైలజ గుంటూరు నగరంలోని ప్రైవేట్ ఆస్పత్రిలో రిసెప్షనిస్ట్‌గా పనిచేస్తుంది. పది రోజుల క్రితం వీరు ఇరువురు వారి ఇళ్లకి వెళ్లి తమ ప్రేమ వ్యవహారాన్ని పెద్దలకు చెప్పారు. కులాంతర వివాహాన్ని పెద్దలు అంగీకరించకపోవడంతో వారం రోజుల క్రితం ఇద్దరూ వారి ఇళ్లల్లో నుంచి వచ్చేశారు. దీంతో యువతి తల్లిదండ్రులు తమ కుమార్తె అదృశ్యమైందని, అందుకు కారణం పెదకాకానికి చెందిన మహేష్ కారణమని నందిగామ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేశారు. మహేష్ తల్లిదండ్రులను నందిగామ పోలీసులు పిలిపించి విచారించారు. మా అబ్బాయి కూడా వారం రోజులుగా కనిపించడంలేదని వారు పోలీసులకు తెలిపారు. వీరు ఎక్కడికి పోయారా.. అని ఇరువురి తల్లిదండ్రులు మదనపడుతుండగా రైల్వే పట్టాలపై నంబూరు రైల్వే స్టేషన్ సమీపంలో మృతదేహాలై పడి ఉన్నారు. గురువారం రాత్రి ద్విచక్ర వాహనంపై లగేజ్ బ్యాగులతో శైలజ, మహేష్ అక్కడికి చేరుకొని ఆత్మహత్య చేసుకోవాలని నిర్ణయించుకొని రైల్వే పట్టాలపై పడుకున్నారు. రైలు వారి పైన పోవడంతో తలభాగాలు కట్ అయ్యాయి. తలలో మెదడు ఇరువురికి బయటకు వచ్చేసింది. శైలజ కాలు తెగి రైల్వే పట్టాల అవతల పడింది. స్థానికులు పెదకాకాని పోలీసులకు సమాచారం అందించారు. రైల్వే సీఐ అంజిబాబు, ఎస్సై రమేష్ సిబ్బందితో సంఘటన స్థలానికి చేరుకొని పరిశీలించారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం మార్చురీకి తరలించారు.



బాధిత కుటుంబాన్ని పరామర్శిస్తున్న ఎమ్మెల్యే నరేంద్ర కుమార్

### మృత్యులోనూ వీడని బంధం

శైలజ, మహేష్‌కు మధ్య ఏర్పడిన స్నేహం ప్రేమగా మారి చివరకు మృత్యువులో కూడా ఇద్దరు కలిసి మరణించారు. మృత్యువులో కూడా వీరి బంధం వీడలేదు. ఒకరినొకరు అర్థం చేసుకొని, గాఢంగా ప్రేమించుకోవడం వల్లే ఇద్దరు కలిసి మరణించారు. కులాంతర వివాహాన్ని కుటుంబ పెద్దలు అంగీకరించకపోవడంతో వీరు ఆత్మహత్య చేసుకున్నారు. రైలు పట్టాలపై తలలు పెట్టి, ఒకరి చేయి మరొకరు పట్టుకొని బలవంతంగా మరణించారు.

### ఎమ్మెల్యే నరేంద్ర పరామర్శ..

సమాచారం తెలుసుకున్న పొన్నూరు ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్ర కుమార్ హుటాహుటిన సంఘటనా స్థలానికి చేరుకున్నారు. చిన్న వయసులో ఇరువురు మృతి చెందడాన్ని చూసి విచారం వ్యక్తం చేశారు. ఇది అత్యంత బాధాకరమని ఆయన వేదన చెందారు. మృతుడు మహేష్ కుటుంబ సభ్యులను పరామర్శించి, తన ప్రగాఢ సానుభూతి తెలిపారు.

# ప్రత్యేక రైళ్ల ద్వారా బాదేందుకేనా?

- రైల్వే టిక్కెట్ల అడ్వాన్స్ రిజర్వేషన్ కాలం తగ్గింపుపై ప్రయాణికుల సందేహం
- రైల్వే చూపుతున్న కారణాలు సహేతుకంగా లేవని వాదన

గుంటూరు, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): రైల్వే టిక్కెట్ల అడ్వాన్స్ రిజర్వేషన్ పీరియడ్(ఏఆర్‌పీ)ని 120 రోజుల నుంచి 60 రోజులకు కుదిస్తూ రైల్వేబోర్డు జారీ చేసిన ఉత్తర్వులపై ప్రయాణికులు సందేహాలు వ్యక్తం చేస్తున్నారు. నవంబరు 1వ తేదీ నుంచి అమల్లోకి రానున్న ఈ మార్పు వలన తమకు ఏమాత్రం మేలు జరగదన్న అభిప్రాయాన్ని వ్యక్తపరుస్తున్నారు. పైగా దీని వలన తత్కాల్ సమయంలో ఎలాగైతే బుకింగ్స్‌కి రద్దీ తలెత్తుతుందో ఇకపై ప్రతీ రోజు ఉదయం 8 గంటలకు 60 రోజుల దాటిన తర్వాత రోజు రైళ్లలో టిక్కెట్ల రిజర్వేషన్ ఓపెన్ కాగానే వాటి కోసం ఆన్‌లైన్, పీఆర్ఎస్ కౌంటర్లలో రద్దీ ఏర్పడుతుందని చెబుతున్నారు. గతంలో ఈ పరిస్థితిని చూసే ఏఆర్‌పీని 120 రోజులకు పెంచారని, ఇప్పుడు తగ్గించడం వలన ఉపయోగం ఏమిటని ప్రశ్నిస్తున్నారు.

### డిమాండ్‌పై స్పష్టత కోసమే..

రైళ్లలో ఏఆర్‌పీ 1995 సెప్టెంబరు 1వ తేదీ నుంచి 1998 జనవరి 31వ తేదీ వరకు 30 రోజులు ఉండేది. దీనిని ఆ తర్వాత సవరించి 60 రోజులకు పెంచారు. 2015 జనవరి 1వ తేదీ వరకు 60 రోజుల ఏఆర్‌పీ అమల్లో ఉంది. ఆ తర్వాత 120 రోజుల ఏఆర్‌పీని తీసుకొచ్చారు. దాదాపుగా ఈ నూతన విధానం అమలులోకి వచ్చి పదేళ్లు పూర్తి కావస్తుంది. ఇప్పుడు హఠాత్తుగా తిరిగి రోజుల ఏఆర్‌పీని రైల్వే శాఖ కుదించేసింది. ఇందుకు కొన్ని కారణాలను చెబుతున్నది. 61 నుంచి 120 రోజుల మధ్యన ఏఆర్‌పీలో బుకింగ్ అవుతున్న టిక్కెట్లలో 21 శాతం రద్దు చేసుకొంటున్నారని పేర్కొంటుంది. అలానే మరో 5 శాతం టిక్కెట్లను బుకింగ్ చేసుకొన్న వారు ఓ వైపు రద్దు చేసుకోకుండా మరోవైపు ప్రయాణం చేయడం లేదని తెలిపింది. దీనివలన రైలు ప్రయాణ డిమాండ్‌పై స్పష్టత ఉండటం లేదని చెప్పింది. 60 రోజులకు ఏఆర్‌పీని కుదించడం వలన వాస్తవ రైలు ప్రయాణ డిమాండ్‌పై స్పష్టత ఉంటుందని, తద్వారా మరిన్ని ప్రత్యేక రైళ్లను ప్లాన్ చేయవచ్చని తెలిపింది.

### సకాలంలో నడిపేటట్లు అయితే..

కాగా ప్రత్యేక రైళ్లు అనగానే ప్రయాణికులు భయపడిపోతున్నారు. వీటిల్లో తత్కాల్(రెగ్యులర్ రైళ్లలో కంటే అదనపు) ఛార్జీని వసూలు చేస్తారు. పైగా వాటిని నిర్ణీత షెడ్యూల్ ప్రకారం నడపరు. ఎక్కడికక్కడ రెగ్యులర్ రైళ్లకు క్రాసింగ్‌లు, ప్రిసిడెన్స్‌లు ఇచ్చి లూప్‌లైన్‌లో గంటల తరబడి పెడుతూ ప్రయాణికుల సహనాన్ని పరీక్షిస్తుంటారు. ముఖ్యంగా తెనాలి వంటి రైల్వేస్టేషన్‌లో స్పెషల్ ట్రైన్ రాత్రి 9 గంటలకు వెళ్లిందంటే కనీసం రెండున్నర గంటల పాటు దానిని లూప్‌లైన్‌లో పెట్టక తప్పని పరిస్థితి. ఇందుకు కారణం ఆ సమయంలో ప్రతీ ఐదు నిమిషాలకు ఒక రైలు మెయిన్‌లైన్‌లో కూత పెడుతూనే ఉంటుంది. ఐదు, ఆరు గంటల ఆలస్యంగా గమ్యస్థానాలకు చేరుతుంటాయి. ప్రత్యేక రైళ్లను ప్లాన్ చేసి వాటిని సకాలంలో నడిపితే ఏఆర్‌పీని 60 రోజులకు కుదించినా ఇబ్బంది ఉండదని, ఎటొచ్చి వాటిని ఆలస్యంగా నడపడమే అసలు సమస్యన్న అభిప్రాయాన్ని ప్రయాణికులు వ్యక్తపరుస్తున్నారు.

### తిరుమలకు వెళ్లే వారికి ఇబ్బందే..

ప్రస్తుతం తిరుమలకు స్పెషల్ ఎంట్రీ దర్శన్, వివిధ రకాల సేవల కోసం వెళ్లే యాత్రికులు ఇంచుమించు 100 రోజులు ముందుగానే బుకింగ్ చేసుకొంటారు. జనవరి నెల 1వ తేదీ నుంచి 31వ తేదీ వరకు వివిధ సేవల ఆన్‌లైన్ బుకింగ్ ఈ నెల 20వ తేదీ తర్వాత ప్రారంభం అవుతుంది. దీనివలన ఆయా తేదీల్లో రైళ్లల్లో బెర్తులు ఖాళీ ఉన్నాయో, లేవో చూసుకొని ఆ తేదీకి తిరుమల టిక్కెట్‌లు బుకింగ్ చేసుకొంటారు. ఇప్పుడు రైల్వే శాఖ 60 రోజులకు ఏఆర్‌పీని కుదించడం వలన యాత్రికులు తొలుత తిరుమల టిక్కెట్‌లు బుకింగ్ చేసుకొని ఆ తర్వాత రైల్వే టిక్కెట్ల కోసం ఎదురు చూడాలి. ఒకవేళ రద్దీ వలన రైళ్లలో టిక్కెట్‌లు బుకింగ్ చేసుకోలేకపోతే ప్రయాణం ఆర్థికంగా భారం అవుతుంది.

# అమరావతి రైతుల కౌలు సమస్య పరిష్కరిస్తాం

- సీఆర్డీఏ అదనపు కమిషనర్ సూర్య సాయి ప్రవీణ్ చంద్

తుళ్లూరు, అక్టోబరు 18:(ఆంధ్రజ్యోతి) రాజధాని అమరావతి ప్రాంతంలో రైతులకు సంబంధించిన కౌలు సమస్యలను ఇప్పటి వరకు కొన్ని పరిష్కరించి వారి ఖాతాల్లో నగదు జమ చేశామని, మిగిలిన వారి సమస్యలను కూడా వెంటనే పరిష్కరిస్తామని ఏపీసీఆర్డీఏ అదనపు కమిషనర్ జి.సాయి సూర్య ప్రవీణ్ చంద్ హామీ ఇచ్చారు. శుక్రవారం తుళ్లూరు సీఆర్డీఏ ప్రాంతీయ కార్యాలయంలో జరిగిన గ్రీవెన్స్ డేలో రాజధాని రైతులు విశేషంగా పాల్గొని వారి సమస్యలను అదనపు కమిషనర్‌కి విన్నవించుకున్నారు. ఏపీ సీఆర్డీఏలోని వివిధ విభాగాల అధికారులు గ్రీవెన్స్‌కు హాజరై అదనపు కమిషనర్ కి వచ్చిన సమస్యల్లో అధిక శాతం అక్కడికక్కడే పరిష్కార మార్గం చూపారు. తక్కినవి వెంటనే పరిష్కరించాలని అదనపు కమిషనర్ ఆదేశాలు జారీ చేశారు. కౌలుపై కొందరు రైతులు అదనపు కమిషనర్‌కి నివేదించగా ఇప్పటికే చాలా మంది రైతులకు కౌలు సమస్యలు పరిష్కరించి వారి ఖాతాల్లో జమ చేశామన్నారు. ప్రతి శుక్రవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు జరిగే గ్రీవెన్స్ డేను రైతులు వినియోగించుకోవాలని ఆయన కోరారు. కార్యక్రమంలో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్‌లు ఎం.విశేశ్వర నాయుడు , కె.స్వర్ణమేరి, బి.సాయి శ్రీనివాస్ నాయక్, జి.భీమారావు, డీసీడీవో బొర్రా శ్రీనివాస రావు, ఇతర అధికారులు పాల్గొన్నారు.



తుళ్లూరు సీఆర్డీఏ కార్యాలయంలో రైతులు ఇచ్చిన అర్జీలను పరిశీలిస్తున్న సీఆర్డీఏ అదనపు కమిషనర్ జీఎస్ఎస్ ప్రవీణ్ చంద్

# బకాయిల సమాచారం లేకపోతే ఎలా?

- జడ్పీ చైర్‌పర్సన్ కత్తెర హెన్రీ క్రిస్టినా



సమావేశం నిర్వహిస్తున్న చైర్ పర్సన్ కత్తెర హెన్రీ క్రిస్టినా, సీఈవో జ్యోతి బసు

గుంటూరు సిటీ, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): మైనింగ్... రిజిస్ట్రేషన్ శాఖలు ఉమ్మడి జిల్లా పరిషత్‌కు సర్‌ఛార్జి, స్టాంప్ డ్యూటీ రూపేణా కోట్ల రూపాయలు చెల్లించాలి. అసలు ఎంత మొత్తం చెల్లించాలో ఆయా శాఖల అధికారుల వద్ద ఖచ్చితమైన సమాచారం లేదు. ఎప్పుడు చెల్లిస్తారో కూడా రెండు శాఖల అధికారులు స్పష్టంగా చెప్పడం లేదు. ఫలితంగా కోట్ల రూపాయల అభివృద్ధి పనులకు ఉమ్మడి జిల్లాలో తీవ్ర విఘాతం ఏర్పడుతుంది. రెండేళ్లుగా ఎన్నోసార్లు జిల్లా పరిషత్ అధికారులు లేఖలు రాసినా ఆయా శాఖల నుంచి స్పందన లేదు. చివరకు శుక్రవారం జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ కత్తెర హెన్రీ క్రిస్టినా ఇదే వ్యవహారంపై సమీక్షించేందుకు ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. మూడు జిల్లాల అధికారులు వచ్చారు కానీ సమాచారం మాత్రం తీసుకురాలేదు. రెండు శాఖల అధికారుల నిర్లక్ష్యంపై జడ్పీ చైర్‌పర్సన్ ఆగ్రహం వ్యక్తం చేశారు. సరైన సమాచారం లేకుండా ఎందుకు వచ్చారని అధికారులను ప్రశ్నించారు. ఉమ్మడి జిల్లా పరిషత్‌తోపాటు, జిల్లాలో ఉన్న నియోజకవర్గాల్లో ఏ మేరకు సర్‌ఛార్జి, స్టాంప్ డ్యూటీ బకాయిలు ఉన్నాయో సమాచారం లేకుండా ఎలా ఉన్నారని ప్రశ్నించారు. దీంతో అధికారులు సోమవారం నాటికి బకాయిల వివరాలు తీసుకువస్తామని చెప్పారు. వీలైనంత త్వరగా బకాయిలు జమ చేసేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. సమావేశంలో జడ్పీసీఈవో వి.జ్యోతి బసు, డిప్యూటీ సీఈవో కృష్ణ, విభాగాల ఏవోలు పాల్గొన్నారు.

# ఇదేమిటి ఇలా ఇరికించారు

- అక్రమార్కులపై రైతుల ఆగ్రహం
- తమ ఖాతాలో పడిన రూ.10.24లక్షలు తిరిగి చెల్లింపు

మేడికొండూరు, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): మండలంలో వరద సాయం అక్రమాలు దాదాపుగా బహిర్గతం అయ్యాయి. ఇదేమిటి ఇలా ఇరికించారు.. అంటూ వరద నష్టం జాబితాలో తమ పేరులను ఇరికించిన అక్రమార్కులపై రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అక్రమాలకు పాల్పడిన ఇద్దరు వ్యక్తులు తాము స్వాహా చేసిన సొమ్మును గురు, శుక్రవారాల్లో తిరిగి రైతులకు అందజేశారు. తమ ఖాతాలో వరద సాయం ఎలా పడిందో తెలియదని చెబుతూ అధికారులకు రైతులు నగదు చెల్లిస్తున్నారు. శుక్రవారం నాటికి 10లక్షల 24వేల రూపాయలను రైతులు తిరిగి చెల్లించారు. పంట నష్టం పరిహారం పంపిణీలో అక్రమాలపై అధికారుల విచారణ మూడో రోజు శుక్రవారం కూడా కొనసాగింది. ఒక్క వెలవర్తిపాడు గ్రామంలోనే 106 హెక్టార్లలో 104 మంది రైతులు నష్టపోయినట్టుగా అధికారులు ప్రభుత్వానికి జాబితా పంపారు. ఈ జాబితాలోనే మేడికొండూరుకు చెందిన బోడెపూడి జోగేశ్వరరావు, వ్యవసాయశాఖలో ఏఈవోగా పని చేస్తున్న నాగరాజు అనే ఇద్దరు తమకు పరిచయమున్న కొందరిని, బంధువుల్లో మరి కొందరిని పంట నష్టపోయిన వారి జాబితాలో చేర్చారు. జాబితాలో సిరిపురం, మేడికొండూరు, గుండ్లపాలెం గ్రామాలతోపాటు మరికొన్ని గ్రామాలకు చెందిన వారు ఉన్నారు. తాము వెలవర్తిపాడు గ్రామంలో వ్యవసాయం చేయలేదని అధికారులకు రాత పూర్వకంగా ఇచ్చారు. అక్రమార్కులిద్దరూ తాము స్వాహా చేసిన సొమ్మును రైతులకు అందజేసి అధికారులకు చెల్లించమని ప్రాధేయపడుతున్నారు.

### రూ.10.24 లక్షలు తిరిగి చెల్లించిన రైతులు

పంట నష్ట పరిహారం తమ ఖాతాలో పడిందని చెబుతూ రైతులు ఇప్పటి వరకు రూ.10.24లక్షలు చెల్లించారని విచారణ చేస్తున్న గుంటూరు ఏడీఏ తిరుమల దేవి విలేకరులకు తెలిపారు. వెలవర్తిపాడు గ్రామంలోనే మొత్తం పరిహారం రూ.18 లక్షలు కాగా దానిలో చాలా వరకు సంబంధంలేని వ్యక్తుల ఖాతాలో పడిందని, దీనికి బాధ్యులైన అధికారులను కూడా విచారిస్తామని చెప్పారు. ఇంకా కొంతమంది తాము తిరిగి చెల్లిస్తామని చెబుతున్నారని ఆమె వివరించారు. అక్రమాలపై పూర్తి స్థాయిలో విచారణ చేస్తామన్నారు.

## 24న జాబ్‌మేళా

గుంటూరు(విద్య), అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): జిల్లా ఉపాధి కార్యాలయం ఆధ్వర్యంలో ఈనెల 24న మార్కెట్ సెంటర్‌లోని హిందూ కళాశాలలో జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధి అధికారి రమాదేవి శుక్రవారం ఒక ప్రకనటలో తెలిపారు. జాబ్‌మేళాలో అమరాజా బ్యాటరీస్, అపోలో ఫార్మసీ, ఫ్లిప్‌కార్ట్, తనిష్క్ తదితర కంపెనీలు పాల్గొంటాయని తెలిపారు. ఇంటర్, డిగ్రీ, పీజీ, డిప్లమా, ఫార్మసీ పూర్తిచేసి 18 నుంచి 35 సంవత్సరాలలోపు ఉన్న యువత జాబ్‌మేళాలో పాల్గొనవచ్చునని తెలిపారు. బయోడేటా, విద్యార్హతల సర్టిఫికెట్స్‌తో నేరుగా ఇంటర్వ్యూలకు హాజరు కావాలని సూచించారు. ఇతర వివరాల కోసం 0863-2350060లో సంప్రదించాలని సూచించారు.

## చీమలమర్రిలో చోరీ

- పది సవర్ల బంగారం, నాలుగు కిలోల వెండి ఆభరణాలు అపహరణ



చోరీ జరిగిన ఇంట్లో పరిశీలిస్తున్న పోలీసులు

నకరికల్లు, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): చీమలమర్రి గ్రామంలో గడ్డం శివరామకృష్ణ ఇంట్లో గురువారం రాత్రి చోరీ జరిగింది. ఈ చోరీలో రూ. 10 లక్షల విలువైన సొత్తు చోరీకి గురైనట్టు గుర్తించారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని చీమలమర్రి గ్రామానికి చెందిన గడ్డం శివరామకృష్ణ గురువారం గుంటూరులోని తన మనుమరాలి వివాహ విషయమై కుటుంబ సభ్యులతో కలసి వెళ్లారు. శుక్రవారం ఉదయం ఇంట్లో తలుపులు తీసి ఉన్నాయని స్థానికులు శివరామకృష్ణకు ఫోన్ ద్వారా తెలియజేయటంతో గుంటూరు నుంచి వచ్చారు. పోలీసులకు సమాచారం అందించటంతో చీమలమర్రిలో శివరామకృష్ణ ఇంటికి వెళ్లి పరిశీలించారు. ఇనుప గ్రిల్‌ను తొలగించి లోనికి ప్రవేశించి బీరువాలో ఉన్న నాలుగు ఉంగరాలు, తాళిబొట్టు తాడు, నల్లపూసల గొలుసు, సుమారు నాలుగు కిలోల వెండి ఆభరణాలు, రూ.86 వేల నగదు అపహరించుకు పోయారు. నకరికల్లు ఎస్ఐ చల్లా సురేష్, క్లూస్ టీమ్ సంఘటనా స్థలానికి చేరుకొని ఆధారాలు సేకరించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

## స్కూల్ టీచర్ మృతి

వినుకొండ టౌన్, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): ప్రమాదవశాత్తు ద్విచక్ర వాహనం పైనుంచి కింద పడి స్కూల్ టీచర్ మృతి చెందిన సంఘటన మండలంలోని నాగులవరం గ్రామ సమీపంలో శుక్రవారం చోటు చేసుకుంది. మృతురాలి బంధువులు తెలిపిన వివరాల మేరకు.. వినుకొండ మండలం గోకనకొండ ప్రభుత్వ పాఠశాలలో ఉపాధ్యాయురాలిగా పని చేస్తున్న కొత్తమాసు ధనలక్ష్మి (41) పాఠశాలకు వస్తుండగా, ప్రమాదవశాత్తు ద్విచక్రవాహనం రోడ్డు గుంతలోకి దిగడంతో అదుపు తప్పింది. వాహనం వెనుక కూర్చొని ఉన్న టీచర్ కింద పడటంతో తలకు తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతి చెందారు. రోజూ అద్దంకి నుంచి వెంకటాపురం వరకు వినుకొండ ఆర్టీసీ బస్సులో వచ్చి, అక్కడ నుంచి తన స్కూటీపై గోకనకొండకు వచ్చే వారని, స్కూటీ ఉన్న ఇంటి యజమాని ఇంటికి తాళాలు వేసి ఉండడాన్ని గమనించిన టీచర్, అదే బాటలో నాగులవరం హైస్కూల్‌లో పనిచేస్తున్న ఎం.శ్రీనివాసరావు ద్విచక్రవాహనంపై ఎక్కి ఇద్దరూ పాఠశాలకు వస్తున్నారు. నాగులవరం గ్రామ సమీపంలోకి రావడంతో రోడ్డుపై ఏర్పడిన గుంతల కారణంగా ద్విచక్ర వాహనం తప్పి టీచర్ మృతి చెందారు. పోలీసులు మృతదేహాన్ని వినుకొండ ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. కేసు నమోదు చేసిన పోలీసులు, పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అందజేశారు. మృతిరాలి భర్త నాగేశ్వరరావు అద్దంకిలో హోల్‌సేల్ వర్తక వ్యాపారం చేస్తున్నారని, వీరికి 7వ తరగతి చదివే ధనూష్ అనే కుమారుడు ఉన్నారు.

## రోడ్డు దాటుతున్న వ్యక్తిని బైక్‌తో ఢీ

నకరికల్లు, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): రోడ్డు దాటుతున్న వ్యక్తిని బైక్ నడుపుతున్న వ్యక్తి ఢీకొట్టాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం అద్దంకి - నార్కెట్‌పల్లి రాష్ట్ర ప్రధాన రహదారిపై నకరికల్లులోని సాయి నరసింహారెడ్డి నగర్ వద్ద రోడ్డు దాటుతుండగా అడ్డరోడ్డు నుంచి వేగంగా వస్తున్న ఏపీ 16ఏఎం 315 నంబరు గల బైక్ నడిపే వ్యక్తి అతి వేగంగా వస్తూ రోడ్డు దాటుతున్న నరసింగపాడుకు చెందిన పుల్లంశెట్టి సుబ్బయ్య(48)ని ఢీకొట్టాడు. బైక్ నడుపుతున్న వ్యక్తి కూడా కింద పడ్డాడు. ఈ ప్రమాదంలో ఇద్దరికీ బలమైన గాయాలయ్యాయి. 108 వాహనంలో నరసరావుపేట ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ సుబ్బయ్య మృతి చెందాడు. మృతుని కుమారుడు మహేష్ బాబు ఫిర్యాదు మేరకు ఎస్ఐ చల్లా సురేష్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## పిడుగుపడి గొర్రెల కాపరి మృతి

వినుకొండ టౌన్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): పిడుగుపడి గొర్రెల కాపరి మృతి చెందిన సంఘటన మండలంలోని దొండపాడు గ్రామంలో శుక్రవారం జరిగింది. మృతుడి బంధువులు తెలిపిన వివరాల మేరకు.. పొలంలో గొర్రెలు మేపుతుండగా పి.కొండయ్య (51)పై పిడుగు పడడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసులకు సమాచారం అందించడంతో సంఘటనా ప్రాంతానికి చేరుకున్న పోలీసులు కేసు నమోదు చేసి, మృతదేహాన్ని వినుకొండ ప్రభుత్వ వైద్యశాలకు తరలించి పోస్టుమార్ట అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అందజేశారు.

## భవనం పైనుంచి పడి వ్యక్తి మృతి

సత్తెనపల్లి, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని భట్లూరు గ్రామానికి చెందిన చేకూరి రామకృష్ణ (35) ప్రమాదవశాత్తు తమ గృహం పైనుంచి పడి మృతి చెందాడు. ఆయన మృతి అనుమానాస్పదంగా ఉండటంతో పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ఏరియా వైద్యశాలకు తరలించారు. రూరల్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## ప్రకాశం బ్యారేజి దిగువకు 54,125 క్యూసెక్కులు

తాడేపల్లి టౌన్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): ఎగువ ప్రాజెక్టుల నుంచి నీటిని విడుదల చేస్తుండడంతో ప్రకాశం బ్యారేజి వద్ద వరద ఉధృతి కొనసాగుతోంది. ఎగువన ఉన్న పులిచింతల ప్రాజెక్టు ప్రధాన వాగుల నుంచి 59,206 క్యూసెక్కుల వరద నీరు బుధవారం ప్రకాశం బ్యారేజి వద్దకు చేరుతున్నట్టు నీటిపారుదల శాఖ జేఈ రాజేష్ తెలిపారు. బ్యారేజి రిజర్వాయర్‌లో 12 అడుగుల నీటిమట్టం కొనసాగుతుండగా 65 గేట్లను 1 అడుగు, 5 గేట్లను 2 అడుగుల మేర ఎత్తి దిగువకు 54 వేల 125 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు.

## పులిచింతల సమాచారం

అచ్చంపేట, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి) : ప్రాజెక్టులో శుక్రవారం 42.16 టీఎంసీల నీటి నిల్వ ఉన్నట్టు పులిచింతల ప్రాజెక్టు ఏఈ రాజు తెలిపారు. ఎగువ నుంచి 65,916 క్యూసెక్కుల నీరు ప్రాజెక్టుకు చేరుతుందన్నారు. ప్రాజెక్టు వద్ద 64,312 క్యూసెక్కుల నీరు దిగువ కృష్ణకు విడుదల చేస్తున్నామని తెలిపారు. 16వేల క్యూసెక్కుల నీరు పవర్ జనరేషన్ ద్వారా కృష్ణా నదికి విడుదల అవుతుంది.

### నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

- విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.5.05
- నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

### బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

| | |
|---|---|
| బ్రాయిలర్ బర్డ్ | 135, 145,155 |
| చికెన్ విత్ స్కిన్ | 260.00 |
| చికెన్ స్కిన్ లెస్ | 270.00 |

## 50,503 మిర్చి టిక్కీల అమ్మకం

గుంటూరు, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): మిర్చియార్డుకు శుక్రవారం 43,523 మిర్చి టిక్కీలు విక్రయానికి రాగా ముందురోజు నిల్వ ఉన్న వాటితో కలిపి 50,503 అమ్మకం జరిగినట్లు గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ ఉన్నతశ్రేణి కార్యదర్శి ఐ వెంకటేశ్వరరెడ్డి తెలిపారు. ఇంకా యార్డు ఆవరణలో 19,806 మిర్చి టిక్కీలు నిల్వ ఉన్నట్లు పేర్కొన్నారు. వివిధ రకాల మిరపకాయలకు ధరలు ఈ కింది విధంగా నమోదయ్యాయి.

| వెరైటీ | కనిష్ఠధర | గరిష్ఠధర | వెరైటీ | కనిష్ఠధర | గరిష్ఠధర |
|---|---|---|---|---|---|
| నాన్ ఏసీ కామన్ వెరైటీ | | | ఏసీ కామన్ వెరైటీ | | |
| 334 | 8200 | 16000 | 334 | 8500 | 16000 |
| నెంబరు.5 | 8500 | 16000 | నెంబరు. 5 | 10500 | 10500 |
| 273 | 12000 | 13500 | 273 | 13000 | 13500 |
| 341 | 9000 | 16000 | 341 | 10000 | 17000 |
| 4884 | 12000 | 13800 | 4884 | 11500 | 16500 |
| సూపర్ 10 | - | - | సూపర్ 10 | 11300 | 11300 |
| నాన్ ఏసీ స్పెషల్ వెరైటీ | | | ఏసీ స్పెషల్ వెరైటీ | | |
| తేజ | 8000 | 18500 | తేజ | 8000 | 18200 |
| బ్యాడిగి | 8500 | 16500 | బ్యాడిగి | 9000 | 14500 |
| దేవనూరు డీలక్స్ | 9000 | 16000 | దేవనూరు డీలక్స్ | 10000 | 15000 |
| తెల్లకాయలు | 5000 | 11500 | తెల్లకాయలు | 5000 | 10500 |

## విద్యుత్‌ శాఖ ఏఈగా కోటేశ్వరరావు

మాచర్లటౌన్‌, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): మాచర్ల పట్టణ విద్యుత్‌ శాఖ ఏఈగా సీహెచ్‌ కోటేశ్వరరావు నియమితులయ్యారు. కోటేశ్వరరావు కారంపూడి ఏఈగా విధులు నిర్వహిస్తూ బదిలీపై మాచర్లకు వచ్చారు. ఈ పోస్టు ఏడాదిగా ఖాళీగా ఉండటం గమనార్హం. కోటేశ్వరరావు గతంలో పట్టణ ఏఈగా విధులు నిర్వహించారు.

## నేడు ఎంపీ,ఎమ్మెల్యే పర్యటన

సత్తెనపల్లి, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కంకణాలపల్లి పంచాయతీ పరిధిలో వెన్నాదేవి, వావిలాల నగర్‌ గ్రామాల్లో శనివారం మధ్యాహ్నం 12 గంటలకు ఎంపీ లావు శ్రీకృష్ణ దేవరాయలు, ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన చేస్తారని మాజీ ఎంపీటీసీ సోలా నంబీ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కూటమి నాయకులు, కార్యకర్తలు ఆయా కార్యక్రమంలో పాల్గొనాలని ఆయన కోరారు.

## రెవెన్యూ సమస్యలను పరిష్కరించుకోండి

మాచవరం, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): గ్రామంలో ఏమైనా రెవెన్యూ సమస్యలుంటే పరిష్కరించు కోవాలని తహసీల్దార్‌ క్షమారాణి రైతులకు సూచించారు. శుక్రవారం భూరీ సర్వే పూర్తయిన చెన్నాయపాలెంలో గ్రామసభ నిర్వహించారు. భూ సమస్యలపై 10 అర్జీలు వచ్చినట్టు తహసీల్దార్‌ తెలిపారు. కార్యక్రమంలో మండల సర్వేయర్‌ సాల్మన్‌ రాజు, మాజీ సర్పంచ్‌లు బొగ్గవరపు అంజయ్య, నరసింహారావు, వీఆర్‌వో అఖిల్‌ పాల్గొన్నారు.

## ప్రజలపై విద్యుత్‌ భారం

అమరావతి, అక్టోబరు 18: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ప్రజలపై రూ.8,114కోట్ల విద్యుత్‌ భారాన్ని మోపేందుకు సిద్ధంగా ఉందని సీపీఎం మండల నేత బీ. సూరిబాబు ఆరోపించారు. ఇందుకు నిరసనగా శుక్రవారం విద్యుత్‌ సబ్‌ స్టేషన్‌ వద్ద సీపీఎం నేతలు నిరసన వ్యక్తం చేశారు. ప్రజలపై విద్యుత్‌ భారాలను మోపాలన్న ప్రభుత్వ ఆలోచనను విరమించుకోవాలని వారు డిమాండ్‌ చేశారు.

## మద్యం కేసులో నిందితుడికి రిమాండ్‌

రెంటచింతల,అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి):తెలంగాణ నుంచి మద్యాన్ని అక్రమంగా తరలిస్తున్న రెండవ నిందితుడైన గాజుల శ్రీనివాసరావును శుక్రవారం అరెస్ట్‌ చేసి కోర్టులో హాజరుపర్చగా మేజిస్ట్రేట్‌ సత్యనారాయణ నిందితునికి 14 రోజుల రిమాండ్‌ విధించినట్లు ఎస్‌ఐ సీహెచ్‌ నాగార్జున చెప్పారు.ఈ ఘటన ఆగస్టు 6న సంభవించిందన్నారు.

## మినీ గోకులాలకు భూమిపూజ

బెల్లంకొండ, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రమైన బెల్లంకొండలో శుక్రవారం మూడు మినీ గోకులాలకు ఎంపీడీవో హనిమిరెడ్డి, సర్పంచ్‌ జ్యోతి సముద్రం భూమి పూజ చేశారు. కార్యక్రమంలో ఏపీవో కోటమ్మ, త్రిసభ్య కమిటీ మెంబరు పీఎస్‌కే రసూల్‌, వైస్‌ సర్పంచ్‌ సుభానీ, మాజీ సర్పంచ్‌ సయ్యద్‌ జానీ, ఎన్‌ పిచ్చయ్య, ఫీల్డ్‌ అసిస్టెంట్‌ వెంకటేష్‌, అధికారులు, ప్రజా ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## గ్రామసభలో 33 దరఖాస్తులు

సత్తెనపల్లి రూరల్‌, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కంటెపూడి గ్రామంలో భూముల రీ సర్వేకు సంబంధించి శుక్రవారం గ్రామ సభ నిర్వహించారు. గ్రామ సభలో రైతుల వద్ద నుంచి 33 అర్జీలు వచ్చి నట్టు తహసీల్దార్‌ కేఏస్‌ చక్రవర్తి తెలిపారు. గ్రామ సభలో రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

## భూ సమస్యల పరిష్కారానికే రెవెన్యూ సదస్సులు

పిడుగురాళ్ల, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): భూముల రీ సర్వేలో వచ్చిన సమస్యలను పరిష్కరించేందుకే రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్‌ జే మధుబాబు తెలిపారు. శుక్రవారం పెద అగ్రహారం గ్రామంలో గ్రామ సభ నిర్వహించారు. వివిధ భూ సమ్యలపై రైతులు అర్జీలను అందజేశారు. కార్యక్రమంలో సర్వేయర్‌ శ్రీనివాసరావు రెవెన్యూ అధికారులు, రైతులు పాల్గొన్నారు.

**గురజాలటౌన్‌:** మండలంలోని తేలుకుట్లలో భూముల రీసర్వేపై గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్డీవో మురళీకృష్ణ మాట్లాడుతూ రైతులు రీసర్వేకు సంబంధించి ఏవైనా భూసమస్యలు ఉంటే గ్రామసభకు దృష్టికి తీసుకువస్తే పరిష్కరిస్తామన్నారు. ప్రజల నుంచి 11 అర్జీలు అందినట్లు తెలిపారు. గ్రామసభలో తహసీల్దార్‌ నగేష్‌ పాల్గొన్నారు.

**దాచేపల్లి :** మండలం అలుగుమల్లె పాడు గ్రామంలో గ్రామ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా తహశీల్దార్‌ వైవీ కుటుంబరావు భూ రీ సర్వే పై రైతులఅభిప్రాయాలను సేకరించారు. కార్యక్రమంలో సొసైటీ నారాయణ, నర్రా పుల్లయ్య, దేవదాయ శాఖ ఈవో నెమలిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## కన్నాను విమర్శిస్తే సహించేది లేదు

సత్తెనపల్లి, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి) : సత్తెనపల్లి నియోజక వర్గ అభివృద్ధికి, కార్యకర్తల సంక్షేమానికి కృషి చేస్తున్న ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణను విమర్శిస్తే సహించేది లేదని టీడీపీ పల్నాడు జిల్లా ఉపాధ్యక్షుడు బత్తుల ఆదినారాయణ శుక్రవారం ఒక ప్రకటనలో ఇతర పార్టీల నేతలను హెచ్చరించారు. కన్నాపై నిరాధార ఆరోపణలు, విమర్శలు చేస్తే, వారికి తగిన విధంగా బుద్ధి చెపుతామని హెచ్చరించారు.

## కుక్కకాటుకి 12 మందికి గాయాలు

సత్తెనపల్లి అక్టోబరు 18 ( ఆంధ్రజ్యోతి) : కుక్కకాటుకు 12 మందికి గాయాలైన సంఘటన పట్టణంలోని సుగాలి కాలనీ, భీమవరంరోడ్డులో శుక్రవారం రాత్రి జరిగింది. యం. యోహాన్‌, టి. బాలజీ నాయక్‌, కార్తిక్‌ నాయక్‌ రామకృష్ణా నాయక్‌, ఏలియ్య, తాన్యాభాను, శ్రీసాయి, వెంకటరాజు లతో పాటు మరో ముగ్గురిని కుక్క కరిచింది. చికిత్స నిమిత్తం వారిని ఏరియా వైద్యశాలకు తరలించారు. కుక్క ఒకేసారి 12 మందిని కరవడం చర్చనీయాంశంగా మారింది.

# ప్రయాణం.. ప్రమాదం

- ప్రమాద భరితంగా వంతెనలు
- శిథిలావస్థకు చేరిన చప్టా, గోడలు
- తుప్పుపట్టి విరిగిపోతున్న రెయిలింగ్‌ పైపులు
- పట్టించుకోని నేతలు, అధికారులు
- ఆందోళన చెందుతున్న స్థానికులు




ఈ వంతెనలపై ప్రయాణం ప్రాణ సంకటమే. వంతెన స్లాబు పూర్తిగా పగుళ్లు ఏర్పడి లోపల ఐరన్‌ తుప్పుపట్టి బయటకి వచ్చింది. వంతెనకు ఇరువైపులా అమర్చిన ఐరన్‌ రెయిలింగ్‌ పూర్తిగా ధ్వంసమైంది. వంతెనపై రాకపోకల సమయంలో వాహనదారులు అప్రమత్తంగా లేకపోతే ఇక అంతే సంగతులు. బస్సు, లారీ ఆ వంతెన మీదుగా వెళ్లాలంటే ఆశలు వదులు కోవాల్సిందే. ఇంతటి ప్రమాదకర దుస్థితిలో వంతెన ఉంటే నేతలు, అధికారులు ఏమీ పట్టనట్లుగా ఉంటున్నారు. ఏదేని ప్రమాదం జరిగితే పరిస్థితి ఏంటని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

పెదకూరపాడు, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి) : నియోజకవర్గ కేంద్రమైన పెదకూరపాడులో రెండు దశాబ్దాల క్రితం నిర్మించిన వంతెనలు నేడు శిథిలావస్థకు చేరి ప్రమాదభరితంగా ఉన్నాయి. ఈ వంతెనలకు సపోర్టుగా ఏర్పాటు చేసిన తుప్పు బట్టి విరిగి పోయాయి. వంతెన నిర్మాణానికి కట్టిన గోడలు, పగళ్ళు ఇచ్చి ప్రమాద భరితంగా ఉన్నాయి. పంచాయతీ కార్యాలయ సమీపంలో ఉన్న ఈ వంతెనల పై నిత్యం ఆర్టీసీ బస్సులతో పాటు ప్రైవేట్‌ స్కూళ్ళకు సంబందించిన బస్సులు, ద్విచక్ర వాహనాలు, ఆటోలు, లారీలు తిరుగుతూ ఉంటాయి. ఒక్కో సారి ఎదురెదురుగా వాహనాలు వచ్చిన సమయంలో వంతెనల పై భారం పడి కూలిపోతాయేనని గ్రామస్థులు ఆందోళన చెందుతున్నారు. పెరిగిన వాహనాల దృష్ట్యా వంతెనలపై ఎదురెదురులో బస్సులు రావాలంటే ట్రాఫిక్‌ స్తంభిస్తుంది. వంతెనలకు కట్టిన గోడల సందుల్లో పిచ్చి చెట్లు మొలచి గోడలు పగిలి బీటలుగా వారాయి. ఇప్పటికైనా సంబందిత శాఖ అధికారులు ఈ వంతెనలపై దృష్టి సారించి నూతన వంతెన నిర్మాణం చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

### మరమ్మతుల పై దృష్టి సారించాలి
### - కందెపు నాగేశ్వరరావు



ఈ వంతెనలు ప్రమాదకరంగా మారాయి. దశాబ్దాల కాలం కిందట నిర్మించిన ఈ వంతెనల పై వాహనాల రద్దీ పెరిగింది. ఎప్పుడు కూలిపోతాయేనన్న భయంతో ప్రజలు ఆందోళన చెంతున్నారు.

### కొత్త వంతెనలు నిర్మించాలి
### - మక్కెన కోటేశ్వరరావు



పెదకూరపాడు నుంచి అబ్బరాజుపాలెం, తాళ్ళూరు, పరస, ఇతర గ్రామాలు వెళ్ళాలన్నా ఈ వంతెల మీదుగానే వెళ్ళాల్సి ఉంటుంటి. వంతెనల పై ప్రయాణించే వాహనాల సంఖ్య పెరుగుతుంది. ప్రమాదాలు జరగకుండా ఉండాలంటే కొత్త వంతెనలను నిర్మించాలి.



తుప్పు పట్టి విరిగిపోయిన రెయిలింగ్‌ పైపులు

# క్యూ ఆర్‌ కోడ్‌తో రైల్వే టిక్కెట్లు

మాచర్లటౌన్‌, అక్టోబరు18(ఆంధ్రజ్యోతి): గుంటూరు డివిజన్‌ పరిధిలోని అన్ని రైల్వే స్టేషన్లలో క్యూఆర్‌ (క్విక్‌ రెస్పాన్స్‌) కోడ్‌ ద్వారా టిక్కెట్ల విక్రయాలు చేపట్టినట్లు గుంటూరు డివిజనల్‌ కమర్షియల్‌ మేనేజర్‌ కె కమలాకరబాబు తెలిపారు. దక్షిణ మధ్య రైల్వే నుంచి వచ్చిన క్యూఆర్‌ కోడ్‌ డిస్‌ప్లే పరికరాలను శుక్రవారం పట్టణంలోని రైల్వేస్టేషన్లో అధికారులకు అందజేసి పలు సూచనలు చేశారు. ఈ సదర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ క్యూఆర్‌ కోడ్‌ డిస్‌ప్లే పరికరాలకు ప్రయాణికులకు ఎంతో ఉపయుక్తంగా ఉంటాయన్నారు. ప్రయాణికులు టిక్కెట్‌ కొనుగోలు, రిజర్వేషన్‌ చేసుకునే సమయంలో క్యూఆర్‌ కోడ్‌ స్కానర్‌లో స్కానింగ్‌ చేసు కొని చెల్లించవచ్చని తెలిపారు. నగదురహిత సేవలను అందిం చేందుకు రైల్వేశాఖ ఈ సదుపాయాన్ని అందుబాటులోకి తెచ్చిందన్నారు. దీని వలన కౌంటర్ల వద్ద చిల్లర కష్టాలు తీరిపోతాయన్నారు. ఈ సమావేశంలో గుంటూరు కమర్షియల్‌ ఇన్‌స్పెక్టర్‌ ఎన్‌ రాజు, నడికుడి ఇన్‌స్పెక్టర్‌ యాదయ్య, మాచర్ల ఎస్‌ఎస్‌పి శివప్రసాద్‌, సిబ్బంది అనిల్‌, బీవీఎస్‌ రెడ్డి, టీవీ రావు పాల్గొన్నారు.



విలేకరులతో మాట్లాడుతున్న గుంటూరు డివిజనల్‌ కమర్షియల్‌ మేనేజర్‌ కమలాకరబాబు

## నాడు-నేడు ఇక నుంచి 'మన బడి - మన భవిష్యత్‌'

రెంటచింతల,అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): పాఠశాల ఆధునీకరణ కోసం గత ప్రభుత్వం ప్రవేశపెట్టిన నాడు-నేడు పథకం పేరును కూటమి ప్రభుత్వం 'మన బడి-మన భవిష్యత్‌'గా మార్పు చేసిందని సత్తెనపల్లి డిప్యూటీ ఈవో ఏసుబాబు తెలిపారు. శుక్రవారం ఎంఈవో కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ మార్పు చేసిన పేరును అన్నింటా చేర్చాలని పాఠశాల విద్యా కమిషనర్‌ ఉత్తర్వులు జారీ చేశారని ఏసుబాబు తెలిపారు. నూతనంగా ఎన్నికైన ఎస్‌ఎంసీ (స్కూల్‌ మేనేజ్‌మెంట్‌ కమిటి) సభ్యులు జాయింట్‌ చెక్‌ హోల్డర్‌గా బ్యాంక్‌ ఖాతాల్లో పేర్లు, డివిజన్‌లోని హెచ్‌ఎంలు బ్యాంక్‌ ఖాతాల్లో ఈ మార్పులు వెంటనే చేయాలని సూచించారు.

## అందుబాటులో వైద్య సేవలు

నకరికల్లు, అక్టోబరు18 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఆస్పత్రుల్లో అందుబాటులోవున్న వైద్యసేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని మండల ప్రత్యేక అధికారి బాలూనాయక్‌ కోరారు. శుక్రవారం కుంకలగుంట ప్రాథమిక ఆరోగ్యకేంద్రాన్ని తనిఖీచేశారు. ఆపరేషన్‌ థియేటర్‌, లేబోరేటరీ రూమ్‌లను పరిశీలించారు. అవుట్‌ పేషెంట్‌ రిజిస్టరును పరిశీలించారు. కార్యక్రమంలో డాక్టర్‌ సీహెచ్‌ వెంకటేశ్వర్లు, డాక్టర్‌ పూజాశ్రీ, ప్రసన్నకుమారి, స్టాప్‌ నర్సు హసీనాబేగం, ల్యాబ్‌ ఇన్‌చార్జి సతీష్‌కుమార్‌, ఫార్మసిస్ట్‌ కల్పన, సిబ్బంది పాల్గొన్నారు.

## స్త్రీశక్తి రుణాలపై విచారణకు చేపడతాం

నకరికల్లు, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): స్త్రీ నిధి కింద మంజూరు చేసిన రుణాలపై సమగ్ర విచారణ చేపడతామని నరసరావుపేట మేనేజర్‌ ఎస్‌.కిషోర్‌ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఇటీవల కండ్లకుంట గ్రామంలో ఒకరి పేరుకు బదులు మరొకరి పేరుతో స్త్రీ రుణాలు పొందినట్టు ఆరోపణలు వచ్చాయి. దీంతో స్త్రీనిధి మేనేజర్‌ గ్రామంలో విచారణ చేసి అవకతవకలు జరిగిన విషయాన్ని ధ్రువీకరణించారు. ఇందుకు వీవోఏ భరత్‌ను బాధ్యుడిగా నిర్ధారించి నగదు రికవరీకి ఆదేశించినట్టు తెలిపారు. మొదటితప్పుగా హెచ్చరికలు జారీ చేసినట్టు తెలిపారు. కండ్లకుంటతో పాటు ఇతర అన్ని వీవోఏలపై విచారణ జరిపి తప్పులు జరిగినట్టు గుర్తిస్తే అందుకు బాధ్యులైన వారి పై శాఖా పరంగా చట్ట పరంగా చర్యలు తీసుకుంటామని తెలిపారు.

# పల్లెల్లో సర్వతో ముఖాభివృద్ధే లక్ష్యం

వెల్దుర్తి, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): పల్లెల్లో సర్వతోముఖాభివృద్ధే కూటమి ప్రభుత్వ లక్ష్యమని తెలుగు యువత రాష్ట్ర ఆర్గనైజింగ్‌ సెక్రటరీ కుర్రి శివారెడ్డి అన్నారు. పల్లెపండుగ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం మిట్టమీదపల్లె, వజ్రాలపాడు, గొట్టిపాళ్ల, గంగలకుంట గ్రామాల్లో సీసీరోడ్ల నిర్మాణాలకు భూమిపూజ చేశారు. కార్యక్రమంలో ఎస్టీసెల్‌అధ్యక్షుడు వజ్రంనాయక్‌, లక్ష్మానాయక్‌, పిచ్చయ్య, శ్రీను, పంచాయతీ రాజ్‌ ఏఈ శ్రీనివాసరెడ్డి, ఎంపీడీవో ప్రసాద్‌ పాల్గొన్నారు.

**దుర్గి:** మండలంలోని కోలగుట్ల, లక్ష్మీపురంతండా, కాకిరాల, మించాలపాడు,జంగమహేశ్వరపాడు గ్రామాల్లో కూటమి నేతలు, అధికారులు పాల్గొని సీసీ రోడ్లు, సైడు డ్రెయిన్ల నిర్మాణానికి భూమిపూజ జరిపారు. కార్యక్రమంలో ఎంపీపీ యేచూరి సునీతాశంకర్‌, దుర్గెంపూడి జానకి రామయ్య, యాగంటి నరేష్‌ పాల్గొన్నారు.

**పిడుగురాళ్ల:** మండలంలోని అయ్యప్పనగర్‌, బ్రాహ్మణపల్లి, కామేపల్లిలో పల్లెపండుగ కార్యక్రమాన్ని నిర్వహించి సీసీరోడ్ల నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో ఏఈ శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

**రాజుపాలెం:** మండలంలోని అంచులవారిపాలెం, అనుపాలెం, కోటనెమలిపురి, నెమలిపురి, శ్రీనివాసనగర్‌ గ్రామాలలో పల్లె పండుగ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సీసీరోడ్లు, సైడు కాల్వలు, గోకులం షెడ్ల నిర్మాణాలకు శంకుస్థాపనచేశారు. కార్యక్రమాల్లో టీడీపీ మండల అధ్యక్షుడు పల్లపాటిపెద్దిరాజు, జనసేన మండల అధ్యక్షుడు తోట నరసయ్య, పంచాయితీ రాజ్‌ డీఈ శేఖర్‌బాబు, ఎంపీడీవో జీవి సత్యానారాయణ, తహసీల్దార్‌ దుర్గేశ్వర రావు తదితరులు పాల్గొన్నారు.

**మాచవరం:** మండలంలోని పలు గ్రామాల్లో పల్లె పండుగ కార్యక్రమం నిర్వ హించారు. ఈ సందర్భంగా సీసీ రోడ్లు, కాంపౌండ్‌వాల్‌ నిర్మాణానికి శంకు స్థాపన చేశారు. కార్యక్రమంలో సర్పంచ్‌ రాగిడి నరేష్‌, టీడీపీ నాయకులు రామారావు, నరసింహారావు పాల్గొన్నారు.


**క్రోసూరు:** మండలంలోని క్రోసూరు, దొడ్లేరు గ్రామాల్లో పశువుల షెడ్లనిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. ఆరు పశువుల షెడ్ల నిర్మాణానికి రూ 2.30 లక్షలు మంజూరు చేయనున్నట్టు ఎన్‌ఆర్‌ఈజీఎస్‌ ఏపీవో వెంకటేశ్వరరావు తెలిపారు. కార్యక్రమంలో పశు వైద్యాధికారి సీహెచ్‌ మల్లయ్య, సచివాలయాల ఉద్యోగులు, ఆయా గ్రామాల సర్పంచ్‌లు పాల్గొన్నారు.

**సత్తెనపల్లి రూరల్‌:** మండలంలోని నందిగామ గ్రామంలో రూ.11.50 లక్షల నిధులతో సీసీ డ్రెయిన్‌లు, దీపాలదిన్నెపాలెంలో రూ.9 లక్షలతో సీసీ డ్రెయిన్‌ల నిర్మాణాలకు ఆయా గ్రామాల ప్రజా ప్రతినిధులు, అధికారులు భూమి పూజ చేశారు.

**అచ్చంపేట:** మండలంలోని పెదపాలెం గ్రామంలో మినీ గోకులంషెడ్డు, హిందూ శ్మశానవాటికకు సిమెంట్‌ రోడ్డు, కల్వర్టులనిర్మాణానికి ఎపీఈడీవో కే శ్రీనివాసరావు శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు నందిగం ఆశీర్వాదం, పంచాయతీ రాజ్‌ ఏఈ డీ.శివయ్య, బాపిరాజు, వెంకటయ్య, హరిబాబు, కోటయ్య, శ్రీనివాస్‌ తదితరులు పాల్గొన్నారు.

**దాచేపల్లి :** పెదగార్లపాడు గ్రామంలో సీసీ రోడ్డు నిర్మాణానికి భూమిపూజ నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ పురంశెట్టి పరంజ్యోతి, గోరే రమారావు, లక్ష్మీనారాయణ తదితరులు ఉన్నారు.

# పట్టభద్రులు ఓటు నమోదు చేసుకోవాలి



పెదకూరపాడు పట్ట భద్రుల ఓటరు నమోదు కేంద్రంలో ఓటు నమోదు చేసుకుంటున్న సీఐ సురేష్‌

పెదకూరపాడు, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): పట్టభద్రులందరూ ఓటురుగా నమోదు చేసుకోవాలని జీడీసీసీ బ్యాంక్‌ మాజీ డైరెక్టర్‌ ఎన్‌వీవీఎస్‌ వర ప్రసాదు అన్నారు. పెదకూరపాడులో జన చైతన్యసమితి ఆధ్వర్యంలో పట్టభద్రుల ఓటునమోదు కేంద్రాన్ని శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వర ప్రసాద్‌ మాట్లాడుతూ 2021 నవంబరు నాటికి బీఏ, బీకామ్‌, బీఎస్సీ, బీటెక్‌, ఎంబీబీఎస్‌ ఏదైనా డిగ్రీ పూర్తి చేసిన ప్రతి ఒక్కరు ఓటరు నమోదుకు అర్హులేన న్నారు. ఈ సందర్భంగా క్రోసూరు సీఐ పత్తిపాటి సురేష్‌ తన ఓటును నమోదు చేసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓటు ఎంతో విలువైనదని, నిర్లక్ష్యం చేయకుండా డిగ్రీ పూర్తయిన ప్రతి ఒక్కరు ప్రొవిజనల్‌ జిరాక్స్‌ ఆధార్‌ జిరాక్స్‌, ఓటరు జిరాక్స్‌, ఫోటోతో పట్టభద్రుల ఓటు నమోదు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు రాయపూడి సాంబశివరావు, జన చైతన్య సమితి ప్రతినిధి వెలితోటి అనీల్‌ కుమార్‌ తదితరులు పాల్గొన్నారు.

## సీసీ కెమేరాల ఏర్పాట్లకు స్థల పరిశీలన


పెదకూరపాడు, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి) : పెదకూరపాడులో సీసీ కెమేరాల ఏర్పాటుకు అధికారులు స్థల పరిశీలన చేశారు. జీడీసీసీ బ్యాంకు మాజీ డైరెక్టర్‌ ఎన్‌వీవీఎస్‌ వరప్రసాదు సూచనలతో హైదరాబాద్‌ జూబ్లిహిల్స్‌ పబ్లిక్‌స్కూల్‌ వ్యవస్థాపకులు అత్తోట మురళీ ముకుంద్‌ సహకారంతో పెదకూర పాడులో సీసీ కెమేరాలను ఏర్పాటు చేస్తున్నారు. క్రోసూరు సీఐ పత్తిపాటి సురేష్‌, జీడీసీసీ బ్యాంక్‌ మాజీ డైరెక్టర్‌ ఎన్‌వీవీఎస్‌ వరప్రసాదు, అత్తోట ముకుందరాయుడు ట్రస్ట్‌ ప్రతినిధులు ఎస్‌.లక్ష్మీనారాయణ, శ్రీహరిలు స్థలాలను పరిశీలించారు. సుమారు 50 ప్రాంతాల్లో సీసీ కేమేరాలు ఏర్పాటు చేయనున్నట్లు వారు తెలిపారు.

## మద్యం షాపు వద్దు

సత్తెనపల్లి, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని 25వ వార్డులో కోటమ్మ సత్రం వద్ద ఇళ్ళ మధ్యలో వైన్‌ షాపు ఏర్పాటు చేయవద్దంటూ ఆ ప్రాంత మహిళలు నిరసన వ్యక్తం చేశారు. గృహాల మధ్యలో వైన్‌ షాపు ఏర్పాటు చేయటం వల్ల మహిళలకు, ఆడ పిల్లలకు ఇబ్బంది కలుగుతుందని మహిళలు ఆందోళన వ్యక్తం చేశారు. అనంతరం డీఎస్పీ కార్యాలయం వరకు ప్రదర్శనగా వెళ్ళి డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని డీఎస్పీ ఎం.హనుమంతరావుకు అందించారు. కార్యక్రమంలో ఆర్యవైశ్యసంఘనేతలు, మహిళలు పాల్గొన్నారు.

## చంద్రబాబుతోనే అర్చకులకు న్యాయం

మాచర్లటౌన్‌, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): సీఎం చంద్రబాబుతోనే అర్చకులకు న్యాయం జరుగుతుందని టీడీపీ సీనియర్‌ నేత, మార్కెట్‌యార్డు మాజీ చైర్మన్‌ యాగంటి మల్లికార్జునరావు అన్నారు. శుక్రవారం పట్టణం లోని కోదండ రామస్వామి ఆలయంలో పల్నాడుజిల్లా అర్చక సేవా సంఘం నూతన కమిటీ ఎన్నికను నిర్వహించారు. జిల్లా అధ్యక్షుడిగా దుర్గి మండలం అడిగొప్పులలోని నిదానంపాటి శ్రీలక్ష్మీ అమ్మవారి ఆలయ అర్చకుడు శేషాచార్యులు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా శేషాచార్యులును దుశ్శాలువాలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో మున్సిపల్‌ చైర్మన్‌ పోలూరి నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.




శేషాచార్యులును సన్మానిస్తున్న నేతలు

## రికార్డుల తనిఖీ

మాచవరం, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): మండలంలోని కొత్తగణేషునిపాడు గ్రామంలో ప్రభుత్వ కార్యాలయాల రికార్డులను మండల ప్రత్యేక అధికారి శ్రీకృష్ణదేవరాయలు శుక్రవారం తనిఖీ చేశారు. అనంతరం గ్రామంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సబ్‌ సెంటర్‌, పాఠశాలలోనూ రికార్డులను పరిశీలించారు. ఆయన వెంట పంచాయతీ కార్యదర్శి సువర్ణ అంబారావు, ఏఎన్‌ఎం, సచివాలయ సిబ్బంది ఉన్నారు.



నరసింగపాడు యూపీ స్కూల్లో ఉపాధ్యాయులతో మాట్లాడుతున్న కలెక్టర్‌ అరుణ్‌బాబు

## మెరుగైన వైద్య సేవలు అందించాలి

- కలెక్టర్‌ పీ అరుణ్‌బాబు ● పీహెచ్‌సీ, యూపీ పాఠశాలలో తనిఖీలు

నకరికల్లు, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి) : ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని జిల్లా కలెక్టర్‌ పీ అరుణ్‌ బాబు ఆదేశాలు ఇచ్చారు. శుక్రవారం ఆయన నరసింగపాడు యూపీ స్కూల్‌ను, నకరికల్లు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. యూపీ స్కూల్‌లో మధ్యాహ్న బోజన పథకం అమలు తీరును పరిశీలించారు. బోధనా విధానాన్ని హెచ్‌ఎంను అడిగి తెలుసుకున్నారు. అనంతరం నకరికల్లు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మిక తనిఖీ చేశారు. ఓపీ రిజిస్టర్‌ను, రోగులకు అందుతున్న వైద్య సేవల గురించి ఆరా తీశారు. పీహెచ్‌సీలో అందుబాటులో ఉన్న సేవలు, మందుల వివరాలను, ల్యాబ్‌ను పరిశీలించారు. వైద్యులు సిబ్బందితో సమీక్షించారు. ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని ఆదేశాలు ఇచ్చారు. ఆయనతో పాటు డీఈవో, ఎంపీడీవో, తహసీల్దార్‌లు ఉన్నారు.

## నేను ఎలా పనిచేశానో యరపతినేనికి తెలుసు

- టీడీపీ ప్రజాప్రతినిధుల సమావేశంలో సీఎం చంద్రబాబు

పిడుగురాళ్ల, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): 1995లో తాను ముఖ్యమంత్రిగా రాష్ట్రాభివృద్ధి కోసం ఎంత కష్టపడ్డానో, ఎంత దూకుడుగా వ్యవహరించానో అప్పటి గుంటూరు ఉమ్మడిజిల్లాలో గురజాల ఎమ్మెల్యేగా ఉన్న యరపతినేని శ్రీనివాసరావుకి బాగా తెలుసునంటూ ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రత్యేకంగా పేర్కొన్నారు. శుక్రవారం మంగళగిరిలోని రాష్ట్ర పార్టీ కార్యాలయంలో టీడీపీ ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ ప్రజా ప్రతినిధుల సమావేశంలో నిర్వహించారు. చంద్రబాబు మాట్లాడుతూ... 1995లో ముఖ్యమంత్రిగా తాను ఉమ్మడి రాష్ట్ర అభివృద్ధికి ఎలా పనిచేశానో గుర్తు చేశారు. 1996లో ప్రజల వద్దకు పాలన, జన్మభూమి కమిటీలు, ప్రజలతో ముఖ్యమంత్రి వంటి వినూత్న పథకాలను ప్రవేశపెట్టినట్లు తెలిపారు. ఈ విషయంపై ఎమ్మెల్యే యరపతినేని స్పందిస్తూ ఆ నాడు ముఖ్యమంత్రిగా చంద్రబాబు వేగంగా సంస్కరణలను అమలు చేశారని, రాష్ట్రాన్ని ముందుకు నడపాలనే లక్ష్యంతో పని చేశారని, ఆక్రమంలో ప్రజలకు ఎంతో చేరువయ్యారని యరపతినేని పేర్కొన్నారు.

## జాబ్‌మేళాలో యువతకు ఉద్యోగాలు

మాచర్లటౌన్‌, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఎస్‌కేబీఆర్‌ కళాశాలలో శుక్రవారం రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యాన నిర్వహించిన జాబ్‌మేళాలో 60 మంది ఉద్యోగాలకు ఎంపికైనట్లు కళాశాల ప్రిన్సిపాల్‌ లక్ష్మీకుమారి, జిల్లా నైపుణాభివృద్ధి అధికారి తమ్మాజీరావులు తెలిపారు. జాబ్‌మేళాలో మూడు కంపెనీల ప్రతినిధులు 76 మంది అభ్యర్థులకు ఇంటర్వ్యూలు నిర్వహించగా 60 మంది ఉద్యోగాలకు ఎంపికయ్యారన్నారు. అనంతరం ఉద్యోగాలు సాధించిన వారికి నియామకపత్రాలు అందించారు. కార్యక్రమంలో జిల్లా ప్లేస్‌మెంట్‌ అధికారి రవీంద్రనాయక్‌, మాచర్ల స్కిల్‌ హబ్‌ కోఆర్డినేటర్‌ కిరణ్‌, శ్రీకాంత్‌ పాల్గొన్నారు.

**సత్తెనపల్లి:** పట్టణంలోని ప్రభుత్వ జూనియర్‌ కళాశాల ఆవరణలో ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ ఆదేశాల మేరకు శుక్రవారం జాబ్‌ మేళా నిర్వహించి నట్లు పల్నాడు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి తమ్మాజీరావు తెలిపారు. జాబ్‌మేళాలో మూడు కంపెనీల ప్రతినిధులు 84 మంది అభ్యర్థులకు ఇంటర్వ్యూలు నిర్వహించి 39 మందిని ఉద్యోగాలకు ఎంపిక చేశారు. కార్యక్రమంలో కళాశాల వైస్‌ ప్రిన్సిపల్‌ జీ.శ్రీనివాసరావు, రామాంజనేయులు, రామకృష్ణారెడ్డి, ఎం.వీరాంజనేయులు, ఆయా కంపెనీల హెచ్‌ఆర్‌ ప్రతినిదులు, కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

## ప్రకృతి సాగుతో ఆదాయం, ఆరోగ్యం

ముప్పాళ్ళ అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి) : ప్రకృతి వ్యవసాయంలో పంటలు పండించటం ద్వారా ఆదాయంతో పాటు, ఆరోగ్యమూ బాగుంటుందని ప్రకృతి వ్యవసాయ జిల్లా ప్రాజెక్టు మేనేజర్‌ కే అమలకుమారి అన్నారు. మండలంలోని నార్నెపాడులో ప్రకృతి వ్యవసాయంపై రైతులకు అవగాహన కల్పించారు. వరిలో ఏ గ్రేడు మోడల్‌, ఏటీఎం మోడళ్ళను ప్రయోగాత్మకంగా పండించిన వేమూరి రజిని వరి పొలాన్ని ఆమె పరిశీలించారు. అలాగే రైతు కూరపాటి సౌజన్యం పొలంలో మిర్చిలో అంతర పంటల సాగు విధానాన్ని రైతులకు వివరించారు. కార్యక్రమంలో సర్పంచ్‌ పోలూరి యలమంద, డీపీపీ భవానీరాజ్‌ పాల్గొన్నారు.

## నేడు టీడీపీ విస్తృతస్థాయి సమావేశం

అమరావతి, అక్టోబరు 18: పెదకూరపాడు నియోజకవర్గ పరిధిలో టీడీపీ నేతలు, కార్యకర్తలతో శనివారం సాయంత్రం స్థానిక జేబీ గార్డెన్స్‌లో విస్తృతస్థాయి సమావేశం నిర్వహించనున్నట్లు టీడీపీ మండల అధ్యక్షుడు మల్లాది విష్ణు శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సమావేశానికి ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్‌ ముఖ్య అతిథిగా పాల్గొంటారని తెలిపారు. పట్టభద్రుల సమావేశంతో పాటు పార్టీ సభ్యత్వ నమోదుపై చర్చించనున్నట్లు తెలిపారు. నియోజకవర్గ పరిధిలోని టీడీపీ నేతలు, కార్యకర్తలు తప్పనిసరిగా హాజరు కావాలని విష్ణు కోరారు.

## చికిత్స పొందుతూ యువకుడి మృతి

ముప్పాళ్ళ అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి) : రోడ్డు ప్రమాదంలో గాయపడి గుంటూరు జీజీహెచ్‌లో చికిత్స పొందుతూ యువకుడు మృతి చెందిన సంఘటన శుక్రవారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం రుద్రవరం గ్రామానికి చెందిన ఆటో డ్రైవర్‌ నంబూరి నరేష్‌(35) ఈనెల 1న సత్తెనపల్లి నుంచి ద్విచక్ర వాహనంపై వస్తూ గేదెను తప్పించ బోయి అదుపుతప్పి కింద పడి పోయాడు. ఈ ప్రమాదంలో అతనికి తీవ్ర గాయాలు కాగా గుంటూరు జీజీహెచ్‌కు తరలించారు. చికిత్స పొందుతూ అతను మృతి చెందాడు. మృతునికి భార్య లక్ష్మీ తిరుపతమ్మ ఉన్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

## నేడు ఎమ్మెల్యే రాక

రెంటచింతల,అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి శనివారం రెంటచింతల, పాలువాయి గేటు గ్రామాల్లో నిర్వహించే పల్లెపండుగ కార్యక్రమంలో పాల్గొననున్నట్లు టీడీపీ మండల అధ్యక్షులు అబ్బిరెడ్డి, మండల పరిషత్‌ మాజీ ఉపాధ్యక్షులు సుమంత్‌రెడ్డిలు శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.





# ఊరే వృద్ధాశ్రమం






గుంటూరు సిటీ, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): మా పిల్లలు బాగా చదువుకోవాలి.. మంచి ఉద్యోగం సాధించాలి.. విదేశాల్లో స్థిరపడాలి. మంచి స్థాయిలో ఉండాలి. ఇవీ పిల్లల విషయంలో తల్లిదండ్రుల కలలు. ఆశలు. ఆ కలలు సాకారం అయ్యాక అమ్మానాన్నల పరిస్థితి ఏమిటి. పిల్లలు బాగా చదువుకుని విదేశాలకు వెళ్తున్నారు బాగానే ఉంది. మరి ఊర్లో ఉంటున్న అమ్మానాన్నలు ఏమవుతున్నారు. ఎటూ వెళ్లలేక.. ఒంటరిగా ఉండలేక.. అందనంత ఎత్తుకు ఎదుగుతున్న పిల్లలను అందుకోలేక.. పిల్లలు వెళ్లిన దారుల వెంట వెళ్లలేక.. ఉన్న ఊరులో వారి కోసం ఏళ్లుగా ఎదురు చూస్తూ ఉసూరుమంటున్నారు. అటువంటి తల్లిదండ్రులు ఎక్కువ మంది ఉన్న ఒక గ్రామమే గుంటూరు జిల్లా పెదనందిపాడు మండలంలోని అన్నవరం. ఇక్కడ అన్నిటికీ సమృద్ధే.. ఊరిలో ఉన్న అమ్మానాన్నలకు అన్నీ ఉన్నాయి. ఒక్క పిల్లల సాంగత్యం తప్ప. ఈ ఊరిని చూశాక.. ఒంటరిగా ఉన్న పెద్ద వాళ్ళ కథలు.. గాథలు విన్నాక.. పిల్లలు పెద్ద వాళ్లు కావాలని కోరుకోవాలి కానీ మరీ అందనంత దూరం వెళ్లాలని మాత్రం కాదని అర్థమవుతోంది. ఇది ఒక్క అన్నవరం గ్రామంలో మాత్రమే కాదు. పరిశీలిస్తే ఉమ్మడి గుంటూరు జిల్లాలోని చాలా గ్రామాల్లో ఇదే పరిస్థితి కనిపిస్తోంది. అన్నవరంలో సుమారు 450 కుటుంబాలు ఉంటాయి. ఇంటికి ఒకరిద్దరు అమెరికా, హైదరాబాద్, బెంగళూరు తదితర ప్రాంతాల్లో ఉద్యోగాల్లో స్థిరపడ్డారు. పిల్లలు రెక్కలొచ్చిన పక్షుల్లా వెళ్ళిపోతే వృద్ధ తల్లిదండ్రులు ఒంటరిగా మిగిలిపోయారు. వారికి తినడానికి.. ఉండడానికి కొదవ లేదు. ఏదైనా ఇబ్బంది వచ్చినప్పుడే అవస్థలు. ఆప్యాయంగా పలకరించే వాళ్లు లేరన్న దిగులు. అన్ని ఇళ్లలో ఇదే పరిస్థితి.

### పాపం పండుటాకులు..

**అన్నవరంలో ఓ వృద్ధ జంట దుస్థితి గురించి ఓ యువకుడు అనుభవం**

నా బాల్య మిత్రుడు అమెరికాలో పెద్ద డాక్టర్. అంతులేని సంపద. పొద్దస్తమానం ఫోన్ చెయ్యడు. రెండు నెలలకు ఒకసారి అదీ అర్ధరాత్రి ఫోన్ చేసి అన్నవరంలో ఉన్న అమ్మా, నాన్న దగ్గరికి వెళ్లి రమ్మంటాడు. నేనూ వాడు పెదనందిపాడు స్కూల్లో పదో తరగతి వరకు కలిసి చదువుకున్నాం. ఇద్దరం మంచి మార్కులతో పాసైనా నా చదువు ముందుకు సాగలేదు. నాన్న చేతి కింద ఉండి వ్యవసాయం చేయాల్సి వచ్చింది. వాడేమో డాక్టర్ అయ్యాడు. వాడ్ని అమెరికా పంపడం వాళ్ల నాన్న కల. అది నెరవేరింది. కానీ వాళ్ళకి వీడు ఒక్కడే కావడం వల్ల ఒక వయస్సు వచ్చేటప్పటికీ ఇబ్బందులు మొదలయ్యాయి. తల్లి తండ్రులకు బీపీ, షుగరు, గుండెజబ్బులు. తరాలు తిన్నా తరగని ఆస్తులున్నాయి. కానీ ఏమీ లాభం. లేచినా, లేవక పోయినా ఆప్యాయంగా పలకరించే వాళ్లు లేరు. చుట్టాలు, బంధువులు ఉన్నారు. అయితే వారు రోజుల తరబడి అంటిపెట్టుకుని ఉండలేరుగా. అయినా ఎందరున్నా ఏమి లాభం. కడుపున పుట్టిన బిడ్డ పక్కన ఉంటే ఆ లెక్కే వేరు. అలా అని వీళ్లు అక్కడకి వెళ్లలేరు. పోనీ వాడు ఇక్కడికి రావాలన్నా కుదరదు. అందుకే నాకు వారిని చూసి వచ్చే పనిని పురమాయిస్తుంటాడు. ఆ పెద్దాయనికి పాలతాలికులు అంటే చాలా ఇష్టం. పెద్దమ్మకి బూందీ అంటే మక్కువ. కానీ చేసుకునే ఓపిక వారికి లేదు. పెద్దాయన చిన్న ముక్కాల పీట తెచ్చి వేస్తే పెద్దమ్మ దాని మీద కూర్చుని ఇద్దరికీ రెండు మెతుకులు వండుతుంది. నేను వెళ్ళేటప్పుడు వారికి ఇష్టమైన వాటిని ఇంట్లో చేయించి తీసుకువెళ్తే ఎంత ఇష్టంగా తింటారో. ఊర్లో వాళ్లందరికీ నా గురించి ఎంత గొప్పగా చెప్పుకుంటారు. దేవుడిచ్చిన కొడుకంటారు.

### చనిపోయినా దిక్కులేదు..



గ్రామంలో ఇటీవల ఓ మధ్య వయస్కురాలు అనారోగ్యంతో మృతి చెందారు. ఆమె పిల్లలు అమెరికాలోనే ఉన్నారు. వాళ్లు రావడానికి కుదరలేదు. దీంతో దూరపు బంధువులే దహన సంస్కారాలు పూర్తి చేశారు. ఇది జరిగాక ఇంటినట్టిపెట్టుకుని ఉన్న పెద్దలకు దిగులు మొదలైంది. అయినా ఏం చేస్తారు.. పిల్లలు సంపాదన కోసం బయటకు వెళ్లక తప్పదు.

### పండుగా.. పబ్బం..

దసరా పండుగకు కొందరు గ్రామానికి వచ్చారు. పెద్దల్లో సంబరం. అయితే ఆ ఉత్సాహం కొద్దిరోజులే. వచ్చేంత వరకు రావడంపై ధ్యాస.. వెళ్లేంత వరకు వెళ్లడం మీద ధ్యాస. గడిపింది కొద్ది గంటలే అయినా సంవత్సరానికి సరిపడా జ్ఞాపకాలు. విదేశాల్లో ఉన్న వాళ్ళు మాత్రం రాలేక పోయారు. కుదిరితే సంక్రాంతికి వస్తామని చెప్పారు. ఇంకేముంది ఇక్కడున్న అమ్మా నాన్న కి అప్పుడే పండుగ.



**ఒంటరి బతుకు : గద్దె సింగయ్య, అన్నవరం**

నేను ట్రాక్టర్ డ్రైవర్‌గా పనిచేశా. భార్య, కుమార్తె ఉన్నారు. భార్య నాతో లేదు. ఉన్న కుమార్తెకు వివాహం జరిపించా. పెళ్లి కాకముందే పిల్ల మీద మనకి హక్కు. పెళ్లి అయితే వాళ్ల జీవితం వాళ్లది. ఒంటిరిగా ఒక్కడినే వండుకుంటా. మనవళ్లు అప్పుడప్పుడు వచ్చి పోతుంటారు. అప్పుడే ఒంటరి బతుకు అలవాటైంది. దేవుడు ఉంచిన వరకు ఇలా ఉండటమే.



**పిల్లల దగ్గర ఉండలేము : పి ఎర్రయ్య, అన్నవరం**

మా పిల్లలు టౌన్‌లో ఉంటారు. మేము మాత్రమే ఇక్కడ ఉంటాము. వాళ్ళ దగ్గర ఉండలేము. సొంత ఊరు అయితే పొద్దు పోతుంది. పట్టణంలో అలా కాదు. పిల్లలు మమ్మల్ని బాగా చూసుకుంటారు. వాళ్లే వచ్చి చూసి పోతారు. వయస్సు అయిపోయాక అన్నీ కావాలంటే దక్కవు మరి.



6 క్రస్ట్‌గేట్ల ద్వారా విడుదలవుతున్న నీరు

## కొనసాగుతున్న నీటి విడుదల

● సాగర్ నుంచి ఆరు క్రస్ట్ గేట్ల ద్వారా దిగువకు..

మాచర్ల రూరల్, రెంటచింతల, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): శ్రీశైలం నుంచి నాగార్జున సాగర్‌కు వరద నీరు పోటెత్తుతుంది. దీంతో సాగర్ నుంచి దిగువనకు నీటి విడుదల మూడో రోజు శుక్రవారం కూడా కొనసాగింది. సాగర్ ప్రాజెక్ట్ అధికారులు శుక్రవారం ఆరు క్రస్ట్ గేట్లను ఎత్తి దిగువకు నీటిని విడుదల చేశారు. క్రస్ట్‌గేట్లను ఐదు అడుగుల మేర ఎత్తి 48,540 క్యూసెక్కులను దిగువకు విడుదల చేస్తున్నారు. సాగర్ నీటి మట్టం 589.90 అడుగులు ఉంది. ఇది 311.74 టీఎంసీలకు సమానం. కుడి కాలువ ద్వారా 3371, ఎడమ కాలువ ద్వారా 6173, ప్రధాన జలవిద్యుత్ కేంద్రం ద్వారా 29,556, క్రస్ట్‌గేట్ల ద్వారా 48,540, ఎస్ఎల్‌బీసీ ద్వారా 1800, ఎల్ఎల్‌సీ ద్వారా 400 మొత్తం ఔట్‌ఫ్లో 89,840 క్యూసెక్కులను విడుదల చేస్తున్నారు. శ్రీశైలం నుంచి సాగర్‌కు ఇన్‌ఫ్లో 89,740 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతోంది.

**టెయిల్‌పాండ్ ప్రాజెక్టుకు భారీగా వరద**

సత్రశాల వద్ద కృష్ణానదిపై నిర్మితమైన నాగార్జునసాగర్ టెయిల్ పాండ్ విద్యుత్ ప్రాజెక్టుకు ఎగువన ఉన్న సాగర్ నుంచి 75 వేల క్యూసెక్కుల వరద నీరొస్తున్నట్లు ఎస్ఈ కె.వెంకటేశ్వరరావు, ఈఈ సుబ్రహ్మణ్యం శుక్రవారం చెప్పారు. ప్రాజెక్టుకు చెందిన 4 గేట్లను 2 మీటర్లు, 2 క్రస్ట్‌గేట్లను 1.5 మీటర్ల మేర ఎత్తి 69 వేల క్యూసెక్కులు, రెండు యూనిట్ల ద్వారా విద్యుత్ తయారీ అనంతరం టీఆర్‌సీ(టేల్ రేస్ ఛానల్)ద్వారా 8420 మొత్తంగా 77420 క్యూసెక్కుల నీటిని పులిచింతలకు విడుదల చేస్తున్నామన్నారు. గురువారం అర్ధరాత్రి 12 గంటల వరకు 1.007 ఎంయూ(మిలియన్ యూనిట్లు) కరెంట్ తయారైందన్నారు. ప్రస్తుతం రిజర్వాయర్‌లో 75.50 మీటర్ల మేర నీరుండగా ఇది 7.080 టీఎంసీలకు సమానమన్నారు.

## పారిశుధ్యం.. స్కూల్ మేనేజ్‌మెంట్లకే..

**బడుల్లో మెరుగైన పరిశుభ్రతకు ప్రణాళిక**
**ప్రత్యేకంగా యాప్, ప్రతీ కమిటీకి గుర్తింపు సంఖ్య**
**ప్రతి బుధ, శుక్రవారాల్లో కమిటీ సభ్యుల పనుల పరిశీలన**

గుంటూరు(విద్య), అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): పరిసరాల్లో చెత్తాచెదారాలు.. మరుగుదొడ్లలో దుర్వాసన.. అపరిశుభ్రత.. ఇదీ కొన్ని ప్రభుత్వ పాఠశాలల్లో పరిస్థితి. అధ్వాన పారిశుధ్యం మధ్యే విద్యార్థులు ఉదయం నుంచి సాయంత్రం వరకు ఉండాలి. మరుగుదొడ్లకు వెళ్లే పరిస్థితులు కూడా కొన్ని పాఠశాలల్లో ఉండేవి కావు. ఇక ఈ పరిస్థితుల నుంచి విద్యార్థులకు ఉపశమనం కలిగించేందుకు ప్రభుత్వం ప్రణాళిక రూపొందించింది. బడుల్లో పారిశుధ్యం మరింత సమర్థవంతంగా అమలు చేసేందుకు కార్యాచరణ సిద్ధం చేసింది. ఇప్పటి దాకా ఉపాధ్యాయులకు భారంగా మారిన పాఠశాలల పారిశుధ్య బాధ్యత ఇక యాజమాన్య కమిటీలకు అప్పగించింది. ఇందుకోసం ప్రత్యేకంగా ఓ యాప్‌ను రూపొందించింది. అదేవిధంగా ప్రతీ పాఠశాలకు ఒక గుర్తింపు సంఖ్యను కేటాయిస్తారు. ఉమ్మడి గుంటూరు జిల్లాలోని 57 మండలాల్లో ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలలు 4233, జడ్పీ, ఉన్నత పాఠశాలలు 345 ఉన్నయి. ఆయా పాఠశాలల్లో పరిసరాలు, మరుగుదొడ్ల పరిశుభ్రతను ఇప్పటి వరకు ఉపాధ్యాయులు పర్యవేక్షించారు. ప్రత్యేకంగా యాప్‌ను రూపొందించి అందులో రోజుకు మూడు సార్లు మరుగుదొడ్ల ఫొటోలు అప్‌లోడు చేయాలని గత వైసీపీ ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసి ఐదేళ్ల అమలు చేసింది. దీనిపై రాష్ట్రం వ్యాప్తంగా ఉపాధ్యాయులు తీవ్ర నిరసన వ్యక్తం చేసినా గత ప్రభుత్వం పట్టించుకోలేదు. అంతేకాకుండా గత ప్రభుత్వం పాఠశాలల యాజమాన్య కమిటీలను రద్దు చేసి తల్లిదండ్రుల పర్యవేక్షణ కమిటీలను ఏర్పాటు చేసింది. ఈ కమిటీలు నెలవారీ జరిగే సమావేశాల్లో పాల్గొని తీర్మానాలపై సంతకాలు చేయడం, ఉత్సవ విగ్రహాల్లా ఉండటం మినహా ఎటువంటి అధికారాలు, బాధ్యతలు ఉండేవికావు. ఈ నేపథ్యంలో ఇటీవల అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం యాజమాన్య కమిటీలను పునరుద్ధరించింది. ఇటీవల పాఠశాలల వారీగా ఎన్నికలు నిర్వహించి నూతన కమిటీలను కూడా ఏర్పాటు చేసింది. అంతేకాకుండా ఈ కమిటీలకు కొన్ని బాధ్యతల్ని అప్పగించడానికి కార్యాచరణ సిద్ధం చేసింది. ఇందులో భాగంగా ప్రతి బుధ, శుక్రవారాల్లో కమిటీ సభ్యులు పాఠశాలకు వచ్చి మరుగుదొడ్లు, ఇతర పారిశుధ్యం తదితరాలకు సంబంధించిన పనులను ఫొటోలు తీసి యాప్‌లో అప్‌లోడు చేయాలని ఆదేశాలు జారీ చేసింది. ఇందుకోసం ప్రత్యేకంగా ఒక్కో కమిటీకి ప్రత్యేక ఐడీ, పాస్‌వర్డ్ కేటాయించింది. ఒక్కో స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీలో సగటున 15 నుంచి 20 మంది సభ్యులు ఉంటారు. వారితోపాటు సచివాలయ సంక్షేమ సహాయకులు పారిశుధ్య పర్యవేక్షణ పనుల్లో భాగస్వాములు కానున్నారు. స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీలకు ప్రత్యేక శిక్షణ ఇచ్చి యాప్‌లో పారిశుధ్య నిర్వహణ ఫొటోలు అప్‌లోడు చేసేలా ఏర్పాట్లు చేయనున్నారు. ఎక్కడైనా మరుగుదొడ్ల మరమ్మతులు, ఇతర సమస్యలు ఉంటే వెంటనే ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయులకు నివేదించి సమస్యను పరిష్కరించేలా ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. ఈ క్రమంలో పాఠశాలల్లో ప్రధానంగా ఉన్న పారిశుధ్య సమస్యకు పరిష్కారం లభించినట్లేనని అటు విద్యార్థులు, ఇటు ఉపాధ్యాయులు భావిస్తున్నారు.




పాఠశాలలో మూత్రశాలలు



సీఎం చంద్రబాబుతో ఎన్టీఆర్‌కి నివాళి అర్పిస్తున్న ఎంపీ శ్రీ కృష్ణదేవరాయులు



ఎమ్మెల్యేలు జీవీ ఆంజనేయులు, నక్కా ఆనందబాబు, కన్నా లక్ష్మీనారాయణ



ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్ర

### రెండో రోజు ఉత్సాహంగా అథ్లెటిక్స్ పోటీలు



## వర్షంలోనూ.. పరుగులు



ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో జరుగుతున్న 35వ సౌత్ జూనియర్ అథ్లెటిక్స్ పోటీలు రెండో రోజు శుక్రవారం ఉత్సాహంగా సాగాయి. వర్షాన్ని సైతం లెక్కచేయకుండా క్రీడాకారులు పతకాల కోసం పరుగులు పెట్టారు. 200 మీటర్ల పరుగు, పది వేల మీటర్లు పోల్‌వాల్ట్, డిస్కస్‌త్రో, 400 మీటర్ల రిలే, జావలిన్ త్రో, 600 మీటర్ల పరుగు, లాంగ్ జంప్ తదితర అంశాలలో పోటీలు జరిగాయి. పోటీల నిర్వహణ కార్యదర్శి ఏ.గౌతమ్ కిరణ్, వ్యాయామ విద్య డైరెక్టర్ ఆచార్య పీపీఎస్ పాల్‌కుమార్ పర్యవేక్షించారు.

-పెదకాకాని, ఆంధ్రజ్యోతి)

## అధినేతతో.. ప్రజాప్రతినిధులు

మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంలో శుక్రవారం పార్టీ ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, నియోజకవర్గ ఇన్‌చార్జీలు, ఇతర ముఖ్య నేతలతో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు సమావేశమయ్యారు. వివిధ అంశాలకు సంబంధించి టీడీపీ అధినేత నేతలకు దిశానిర్దేశం చేశారు. ఈ సమావేశానికి ఉమ్మడి గుంటూరు జిల్లా పరిధిలోని నేతలు హాజరయ్యారు.

-మంగళగిరి, ఆంధ్రజ్యోతి



ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మారెడ్డి



ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు









ఎమ్మెల్యేలు బూర్ల రామాంజనేయులు, నసీర్ అహ్మద్, భాష్యం ప్రవీణ్, గళ్లా మాధవి, తెనాలి శ్రావణ్‌కుమార్

## గుంటూరు మీదగా శబరిమలకు భారత గౌరవ రైలు

గుంటూరు, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): శబరిమల పుణ్యక్షేత్రానికి గుంటూరు మీదగా భారత గౌరవ రైలుని నడపనున్నట్లు ఐఆర్‌సీటీసీ ప్రకటించింది. నెంబరు. ఎస్‌సీజెడ్‌బీజీ32 (శబరిమల యాత్ర) కోడ్ రైలు నవంబరు 16వ తేదీన సికింద్రాబాద్ నుంచి ఉదయం 8 గంటలకు బయలుదేరి 10.40కి నల్గొండ, మధ్యాహ్నం 1 గంటకు పిడుగురాళ్ల, 2.45కి గుంటూరు, 3.25కి తెనాలికి చేరుకొని శబరిమలకు వెళుతుంది. యాత్రలో భాగంగా సన్నిధానంలో అయ్యప్పస్వామి దర్శనం, ఆ తర్వాత చొట్టానికర సందర్శన ఉంటుందన్నారు. మొత్తం నాలుగు రాత్రులు, ఐదు పగటిపూటల ప్రయాణం ఉంటుందని సంస్థ తెలిపింది. ఎకానమి, స్టాండర్డ్, కంఫర్ట్ క్లాసులు ఉంటాయన్ని, యాత్ర పూర్తి వివరాల కోసం సీహెచ్ బాలాజీ(9281030714), ప్రవీణ్ నాయక్(9281495848)లను సంప్రదించాలని ఐఆర్‌సీటీసీ ఒక ప్రకటనలో తెలిపింది.

**రెండు రైళ్ల రద్దు**

మెయిన్‌టెనెన్స్ వర్కులు కారణంగా నవంబరు 1వ తేదీ నుంచి 30వ తేదీ వరకు నెంబరు. 07791 కాచీగూడ - నడికుడి, నెంబరు. 07792 నడికుడి - కాచీగూడ రైళ్లను రద్దు చేస్తున్నామని దక్షిణ మధ్య రైల్వే సీపీఆర్‌వో ఏ శ్రీధర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. కాగా నెంబరు. 17646 రేపల్లె - సికింద్రాబాద్ ఎక్స్‌ప్రెస్‌ని నవంబరు 21, 22 తేదీల్లో 75 నిమిషాల ఆలస్యంగా బయలుదేరేలా రేపల్లెలో రీషెడ్యూల్ చేయడం జరిగిందన్నారు.

## నేడు జ్యోత్స్న సంస్మరణ సభ

గుంటూరు సిటీ, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి) : ప్రముఖ సామాజిక ఉద్యమకారిణి గుళ్ళపల్లి జ్యోత్స్న సంస్మరణ సభ శనివారం జరగనున్నట్లు కుటుంబ సభ్యులు వెల్లడించారు. మంగళగిరి డీజీపీ కార్యాలయం సమీపంలోని సి.కె. కన్వెన్షన్ నందు ఈ కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. గుళ్ళపల్లి జ్యోత్స్న ఇటీవల రాజస్థాన్‌లో జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన సంగతి విదితమే. ఆమె ప్రముఖ న్యాయవాది, అల్ ఇండియా లాయర్స్ యూనియన్ నేషనల్ వర్కింగ్ ప్రెసిడెంట్,రాష్ట్ర బార్ కౌన్సిల్ సభ్యులు సుంకర రాజేంద్ర ప్రసాద్ సతీమణి. జ్యోత్స్న విద్యార్థి దశ నుండి అభ్యుదయ భావాలతో పని చేస్తూ, సారా వ్యతిరేక ఉద్యమం, మహిళల హక్కుల కోసం, విద్యార్థినుల సమస్యలపై, సమానత్వం కోసం అనేక సంఘాలను ఏర్పాటు చేసి వారి అభ్యున్నతి కోసం పాటుపడ్డారు.

## ఇంతవరకు... బోరుగడ్డ ముఖమే చూడలేదు

**వైసీపీ నేతలు, బోరుగడ్డ మైండ్ గేమ్‌లో భాగంగానే నా పేరు వెల్లడి.. మాజీ మంత్రి, టీడీపీ నేత మోపిదేవి**

గుంటూరు, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి) : గత వైసిపి ప్రభుత్వ హయాంలో సోషల్ మీడియాలో అసభ్యకరమైన, దారుణమైన వ్యాఖ్యలతో ప్రతిపక్ష నేతలను, మహిళలను కించపరిచేలా పోస్టింగ్స్ పెడుతూ చెలరేగిన రౌడీషీటర్ బోరుగడ్డ అనిల్ కుమార్‌ను తాను ఒక్కసారి కూడా చూడలేదని మాజీ మంత్రి, టిడిపి నేత మోపిదేవి వెంకట రామారావు స్పష్టం చేశారు. బోరుగడ్డ అనిల్ కుమార్ ను పోలీసులు అదుపులోకి తీసుకొని విచారించిన సమయంలో తాను నాడు వైసిపి నేతలైన మోపిదేవి వెంకటరమణ, ఆయన సోదరుడితోపాటు లేళ్ళ అప్పిరెడ్డి ప్రోత్సహించినందునే వారిని తిట్టానని చెప్పాడు. అయితే బోరుగడ్డ అనిల్ పోలీసుల విచారణలో తన పేరు చెప్పడంతో ఆశ్చర్యానికి గురయ్యానని మోపిదేవి స్పష్టం చేశారు. ఏనాడు నేను అనిల్ ముఖమే చూడలేదని స్పష్టం చేశారు. నేను వైసీపీని వీడి టీడీపీలో చేరడం ఇష్టం లేని వారే అనిల్ తో తన పేరు చెప్పించి ఉంటారని అనుమానం వ్యక్తం చేశారు. తాను వైసీపీలో ఉన్నప్పుడు కూడా ఎప్పుడు ఇటువంటి దుర్మార్గ పనులను ప్రోత్సహించలేదన్నారు. సీఎం చంద్రబాబు పవన్ కళ్యాణ్ లోకేష్ లతోపాటు పలువురు ముఖ్య నేతలను మహిళలను కించపరిచే విధంగా సోషల్ మీడియాలో దారుణంగా దూషించిన అనిల్ కుమార్ ఆయా నేతల, పార్టీల కార్యకర్తల దృష్టి మరల్చేందుకే ఇటువంటి వ్యాఖ్యలు చేసి ఉంటాడన్నారు. తాను ఏనాడు బోరుగడ్డ అనిల్ ముఖం కూడా చూడలేదని అటువంటి వ్యక్తితో నా పేరు చెప్పించారంటే వైసీపీ నాయకులు, బోరుగడ్డ అనిల్ ఆడుతున్న మైండ్ గేమ్‌లో భాగమై ఉంటుందని ఆయన అభిప్రాయం వ్యక్తం చేశారు.

## నరసరావుపేటలో... కొలిక్కిరాని వివాదం

◆ 50 శాతం వాటా ఇవ్వాల్సిందేనని పట్టు
◆ బాటిల్‌కు అదనంగా రూ. 10 వసూలు

నరసరావుపేట, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి) : నరసరావుపేట తెలుగుదేశం పార్టీలో నెలకొన్న మద్యం షాపుల వివాదం ఇంకా ఒక కొలిక్కి రాలేదు. 50 శాతం షాపుల్లో వాటాలు కోరుతున్న టీడీపీ నేతలు వ్యాపారులు షాపులు ప్రారంభిస్తున్నా మిన్నకున్నారు. నరసరావుపేట పట్టణంలో 7 షాపులకుగాను మూడు షాపులు మాత్రమే ప్రారంభించారు. షాపుల్లో వాటాల కోసం పార్టీ శ్రేణులు నుంచి వసూలు చేసిన మొత్తాలను తిరిగి ఇచ్చేందుకు సదరు నేతలు సిద్ధమైనట్లు ప్రచారం. రెండు రోజుల్లో షాపులు వ్యవహారం ఒక కొలిక్కి వస్తుందని అప్పటి వరకు వేచి చూద్దామని డబ్బు వెనక్కు తిసుకోలేదని డబ్బు చెల్లించిన వ్యక్తులు తెలిపారు. ఒక మద్యం షాపులో 5 శాతం వాటా రూ. 7.50 లక్షలుగా నిర్ణయించి పార్టీ శ్రేణుల నుంచి డబ్బు వసూలు చేసినట్టు చెబుతున్నారు. టీడీపీలోని ఒక వర్గం ఒక షాపు, మరో వర్గం రెండు షాపులను పట్టణంలో ప్రారంభించారు. ఇంకా నాలుగు షాపులను ప్రారంభించాల్సి ఉంది. టీడీపీలో మద్యం షాపుల రచ్చ ఇంకా సమసిపోలేదన్న వాదన వినిపిస్తోంది. అయితే కొందరు నేతలు ఇరు వర్గాలో చర్చలు జరిపినట్టు తెలిసింది. నియోజకవర్గంలో అన్ని షాపులు ప్రారంభించిన తర్వాత వాటాల సంగతి చర్చిద్దామని కొందరు పార్టీలోని పెద్దలు ఇరువర్గాలతో చర్చలు జరిపిన నేపథ్యంలోనే పట్టణంలో మూడు షాపులు ప్రారంభమయ్యాయని చెబుతున్నారు.

జిల్లాలోని కొన్ని ప్రాంతాల్లో బాటిల్‌కు రూ 10 నుంచి రూ 20 కి అదనంగా షాపుల నిర్వాహకులు వసూలు చేశారు. ధరలు తగ్గుతాయని ఆశపడ్డ మందుబాబులు పాత ధరలకే మద్యం విక్రయిస్తుండటంతో వారు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. షాపుల కోసం అధిక సంఖ్యలో దరఖాస్తులు దాఖలు చేసిన వ్యాపారులు అదనపు ధరలకు మద్యం విక్రయించకపోతే తమకు గిట్టుబాటు కాదన్న వాదన వినిపిస్తున్నారు. గ్రామల్లో మద్యం బెల్టు షాపులకు గిరాకి పెరిగింది. వ్యాపారులు ఎవరికి పట్టు ఉన్న గ్రామంలో వారు మద్యం బెల్టు షాపులు నిర్వహించేందుకు ఏర్పాటు చేసుకుంటున్నారు. రెండు మూడు రోజుల్లో గ్రామాల్లో బెల్టు షానులు పూర్తి స్థాయిలో ఏర్పాటు చేస్తామని వ్యాపారులే బహిరంగంగా చెబుతున్నారు. పట్టణాల్లో కూడా బంకుల్లో కూడా బెల్టు షాపులు వెలవనున్నాయి.

# పల్నాడు వార్తలు

◆ నరసరావుపేట ◆ వినుకొండ ◆ చిలకలూరిపేట

### 20న మెగా నేత్ర వైద్య శిబిరం

నరసరావుపేట టౌన్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): నరసరావుపేట పట్టణంలోని రాజాగారి కోట డాక్టర్ కోడెల శివప్రసాదరావు హాస్పటల్‌లో ఈ నెల 20న ఉచిత మెగా నేత్ర వైద్య శిబిరం జరుగుతుందని మందాడి రవి శుక్రవారం తెలిపారు. డాక్టర్ కోడెల శివప్రసాదరావు చారిటబుల్ ట్రస్ట్, శంకర నేత్ర వైద్యశాల ఆధ్వర్యంలో జరిగే ఈ వైద్యశిబిరం ఉదయం 8గంటలకు ప్రారంభం అవుతుందన్నారు. ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు.

### వర్షాల కారణంగా ఆట స్థలం మార్పు

రొంపిచర్ల, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన రొంపిచర్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఈ నెల 19న ఉమ్మడి గుంటూరు జిల్లా అండర్-14 బాలురు, బాలికల సాఫ్ట్‌బాల్ పోటీలు, జిల్లా జట్ల ఎంపికలు జరగనున్నాయి. వర్షాల కారణంగా ఆట స్థలం అనుకూలంగా లేకపోవటంతో పోటీలను నరసరావుపేటలోని ఎస్ఎస్ఎన్ కళాశాల బాలుర హాస్టల్ గ్రౌండ్‌లో నిర్వహించనున్నట్లు హెచ్ఎం బీఎం సుభానీ శుక్రవారం తెలిపారు. ఈ విషయాన్ని సదరు క్రీడాకారులు గమనించాలని కోరారు.

### మందు బాబుల వీరంగంపై ఆర్టీసీ డ్రైవర్ ఫిర్యాదు

రొంపిచర్ల, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అన్నవరం గ్రామం వద్ద మందుబాబులు శుక్రవారం వీరంగం వేసినట్లు ఆర్టీసీ డ్రైవర్ ఫిర్యాదుచేశాడు. డ్రైవర్ కథనం ప్రకారం రొంపిచర్ల నుంచి నరసరావుపేట వెళ్తున్న ఆర్టీసీ సర్వీసు ముందు ద్విచక్ర వాహనంపై వెళ్తున్న ఇద్దరు యువకులు బస్సు ముందు అడ్డదిడ్డంగా వాహనాన్ని తిప్పారు. వర్షం కురుస్తూ ఉండటంతో డ్రైవర్ వారిని తప్పించబోగా పక్కనే ఉన్న మట్టిలో బస్సు కూరుకుపోయింది. అంతేకాకుండా యువకులు డ్రైవర్ వెంకటరావుతో దురుసుగా ప్రవర్తించారు. దీంతో డ్రైవర్ రొంపిచర్ల పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఆర్టీసీ సర్వీసును తరువాత బయటకు తీశారు.

### మూడు గ్రామాల్లో సిమెంట్ రోడ్ల నిర్మాణాలకు శంకు స్థాపన

రొంపిచర్ల, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అన్నవరపాడు, అచ్చయ్యపాలెం, చట్టిపోతులవారిపాలెం గ్రామాల్లో పల్లె పండుగలో భాగంగా సిమెంట్ రోడ్ల నిర్మాణాలకు శుక్రవారం శంకుస్థాపనలు జరిగాయి. ఉపాధి హామీ ఏపీవో ప్రసాదు, ఆయా గ్రామాల నాయకులు పాల్గొన్నారు. అన్నవరప్పాడులో రూ.10లక్షలు, అచ్చయ్యపాలెంలో రూ.8లక్షలు, చిట్టిపోతులవారిపాలెంలో రూ.1.50లక్షలతో సిమెంట్ రోడ్ల నిర్మాణాలకు శంకుస్థాపనలు చేశారు.

### ముత్తనపల్లిలో గ్రామసభకు 22 దరఖాస్తులు

రొంపిచర్ల, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ముత్తనపల్లిలో రెవెన్యూ శాఖ ఆధ్వర్యంలో గ్రామసభ శుక్రవారం జరిగింది. ఈ సభలో భూములకు సంబంధించి 22 దరఖాస్తులు అందినట్లు తహసీల్దార్ బండి నిర్మల తెలిపారు. వీటిని త్వరలో పరిష్కరిస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ కోటేశ్వరరావు, మండల సర్వేయర్ రవి, తెలుగుదేశంపార్టీ నాయకులు గాడిపర్తి సురేష్ తదితరులు పాల్గొన్నారు.

### 22న గ్రహణమొర్రి శస్త్ర చికిత్సలు: డీఎంహెచ్‌వో డాక్టర్ రవి

నరసరావుపేట లీగల్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): మాచర్లలో ఈ నెల 22న ఉచిత గ్రహణ మొర్రి శస్త్ర చికిత్సలు అవగాహన కార్యక్రమం నిర్వహిస్తున్నామని డీఎంహెచ్‌వో డాక్టర్ బీ రవి శుక్రవారం తెలిపారు. గర్భాశయం అభివృద్ధి చెందుతున్నప్పుడే ఈ విధమైన గ్రహణ మొర్రి అల్ట్రా సౌండ్ ద్వారా చూడవచ్చునన్నారు. మొదటి పుట్టిన రోజులోపే బాలలకు శస్త్ర చికిత్స ద్వారా గ్రహణం మొర్రిని సరి చేయవచ్చు అన్నారు. పట్టణంలోని పాత ప్రభుత్వ ఆసుపత్రిలో డైట్ సెంటర్‌లో గ్రహణమొర్రికి అన్నివిధాల చికిత్సలు ఉచితంగా చేస్తారన్నారు. ఈ అవకాశాన్ని పల్నాడు ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

### నేటి నుంచి సామాజిక తనిఖీలు

ఈపూరు, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): జాతీయ ఉపాధిహామీ పథకం 16వ సామాజిక తనిఖీలు 19వ తేదీ నుంచి నిర్వహిస్తున్నట్లు అధికారులు తెలిపారు. గ్రామాలలో జరిగే తనిఖీల సమయంలో ఉపాధి హామీ పథకం సిబ్బంది, పంచాయతీ అధికారులందరూ అందుబాటులో ఉండాలన్నారు. తనిఖీల అనంతరం గ్రామ సభలు నిర్వహించడం జరుగుతుందన్నారు.

### 12 మంది ఎంఏఎం విద్యార్థులకు ఉద్యోగాలు

నరసరావుపేట టౌన్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఎంఏఎం మహిళా ఇంజనీరింగ్ కళాశాలలో బెంగుళూరు, హైదరాబాద్‌కు చెందిన క్యూ స్పైడర్ కంపెనీ క్యాంపస్ డ్రైవ్ నిర్వహించిందని చైర్మన్ మేదరమెట్ల రామశేషగిరిరావు శుక్రవారం తెలిపారు. రాతపరీక్ష, గ్రూప్ డిస్కషన్, ఇంటర్వ్యూ ద్వారా 12మందిని ఉద్యోగాలకు ఎంపిక చేశారు. ఎంపికైన విద్యార్థులకు ఒక్కొక్కరికి ఏడాదికి రూ.4లక్షలు వేతనంగా అందజేస్తారని ప్రిన్సిపాల్ డాక్టర్ సాధినేని రామారావు అన్నారు. కార్యక్రమంలో ప్లేసెమెంట్స్ ఆఫీసర్ జె రవిశంకర్, రాధికా, సితార, నవీన్‌లు ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులను అభినందించారు.

### నులిపురుగుల నివారణ మందుల పంపిణీ

బొల్లాపల్లి, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పేరూరుపాడులో రాష్ట్ర పశుసంవర్ధక శాఖ వారి ఆధ్వర్యంలో శుక్రవారం వర్షాకాలంలో గొర్రెలకు, మేకలకు ఉచితంగా నులి పురుగుల నివారణ మందులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మేకలకు నులి పురుగుల నివారణ మందులను యూనిట్ ఇన్‌చార్జ్ గంగినేని రామయ్య పంపిణీ చేశారు. కార్యక్రమంలో రాచపల్లి ఏడుకొండలు, శరత్, శ్రీను, బొప్పూడి శ్రీనివాస్, కాట్ల రామయ్య, శ్రీనునాయక్, వెటర్నరీ అసిస్టెంట్ కోటయ్య పాల్గొన్నారు.

## వినుకొండలో ట్రాఫిక్ పద్మవ్యూహం

- ప్రధాన రహదారికి ఇరువైపులా ఆక్రమణలు
- రోడ్లపైనే వాహనాల పార్కింగ్
- పట్టించుకోని పోలీసులు



శివయ్యస్థూపం సెంటర్‌లో ప్రయాణీలను దించేందుకు నడిరోడ్డుపై నిలిపిన ఆర్టీసీ బస్సు



బైకుల పార్కింగ్‌తో ఇరుకుగా మారిన ఏడీబీ బ్యాంక్‌కు వెళ్లే రోడ్డు



లాయర్ స్ట్రీట్‌లో సరుకులు దించుతున్న లారీ

వినుకొండ, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): వినుకొండ పట్టణంలో రోజురోజుకూ ట్రాఫిక్ సమస్య జఠిలంగా మారుతోంది. రోడ్లపై తోపుడు బండ్లు, జాతీయ రహదారిపై విగ్రహాలు, రోడ్డుకి ఇరువైపులా ఆక్రమణలు పెరగడంతో వినుకొండ పట్టణంలో ట్రాఫిక్ సమస్య పెరిగి వాహనచోదకులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వాహనాల రద్దీకి అనుగుణంగా పట్టణంలో రహదారులు విస్తరించకపోవడం, పట్టణానికి బయటగా బైపాస్ రోడ్డు లేకపోవడంతో ప్రజలకు ట్రాఫిక్ సమస్య తప్పడంలేదు. రోడ్డుకి ఇరువైపులా ఆక్రమణలు పెరిగాయి. ప్రధాన రహదారులపైనే పండ్లు, కూరగాయలు, చిరువ్యాపారులు తోపుడు బండ్లు పెడుతున్నారు. వినుకొండ నియోజకవర్గ కేంద్రం కావడంతో నూజెండ్ల, శావల్యాపురం, బొల్లాపల్లి, ఈపూరు, వినుకొండ మండలాల్లోని గ్రామాలతోపాటు ప్రకాశం జిల్లాలోని పలు ప్రాంతాల నుంచి రాకపోకలు సాగించే వాహనాలతో విపరీతమైన రద్దీ పెరిగింది. గుంటూరు-కర్నూలు జాతీయ రహదారి మార్గం కావడంతో వినుకొండ పట్టణంలో నుంచే వాహనాలన్నీ వెళ్లాల్సిన పరిస్థితి. కార్లు, బస్సులు, మినీవ్యాన్లు, భారీలోడ్లతో లారీలు, కంటైనర్‌లు పట్టణంలో నుంచే వెళ్తున్నాయి. పట్టణానికి ప్రధాన కూడలి అయిన శివయ్య స్థూపం సెంటర్‌లోని ఎన్టీఆర్ విగ్రహం వద్ద భారీ వాహనాలు మలుపు తిరగడం కష్టతరంగా మారి నిత్యం ట్రాఫిక్ సమస్య నెలకొంటోంది. ఏనుగుపాలెం, మెయిన్, మార్కాపురం, నర్సరావుపేట, కారంపూడి రోడ్లుకు వెళ్లే వాహనాలు రంగనాయకస్వామి గుడివద్ద అన్నీ కలవడంతో ట్రాఫిక్ సమస్య నిత్యకృత్యంగా మారింది. వీటితోపాటు రోడ్లకిరువైపులా వ్యాపార సంస్థల ఆక్రమణలు, మున్సిపల్ డ్రైనేజీలపై అక్రమ నిర్మాణాలు, వాటిముందు చిరువ్యాపారుల తోపుడు బండ్లు ఉండడంతో వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడుతుంది.

**వాహనాల రద్దీ తీవ్రం**

ఉదయం విద్యార్థులను పాఠశాలలకు తీసుకొచ్చి, సాయంత్రం ఇంటి వద్ద దింపేందుకు స్కూల్ బస్సులు, ఆటోలు, మినీ వాహనాలకు పట్టణంలోని ట్రాఫిక్ సమస్య తీవ్ర ఇబ్బందిగా ఉంది. శివయ్య స్థూపం మలుపు వద్ద వాహనాల రద్దీ తీవ్రంగా ఉండడం, ప్రయాణికులు ఎక్కేందుకు, దిగేందుకు ఆర్టీసీ బస్సులు రోడ్డుపైనే ఆపుతుండడంతో ట్రాఫిక్ నిలిచిపోతోంది. రోజురోజుకూ వాహనాల సంఖ్య పెరిగిపోతుండటంతో మెయిన్ రోడ్డుపై అడుగు పెట్టలేని పరిస్థితి నెలకొంది. పట్టణంలో ప్రధాన వీధులైన లాయర్ స్ట్రీట్, కొత్తపేట రోడ్డు, సురేష్‌మహల్ రోడ్డు, కారంపూడి రోడ్డు, ఆర్టీసీ బస్టాండ్, నర్సరావుపేట రోడ్డు, మార్కాపురం రోడ్లలో హాస్పిటల్స్, షాపింగ్ మాల్స్, బ్యాంక్‌లు, లాడ్జీలు, వ్యాపార సముదాయాలు కలిగిన ప్రాంతాల్లో అనేక చోట్ల షాపింగ్ కాంప్లెక్స్‌లకు సెల్లార్లు ఉన్నప్పటికీ పార్కింగ్ కోసం వినియోగించకుండా షాపులు నిర్మించి అద్దెలకు ఇవ్వడంతో వాహనదారులు రోడ్లపైనే ద్విచక్ర వాహనాలు పార్కింగ్ చేస్తున్నారు. దీంతో అక్కడ ట్రాఫిక్ సమస్య నెలకొంటోంది. ఆర్అండ్‌బీ రోడ్డు, మెయిన్ రోడ్లలో వ్యాపార సముదాయాల వద్ద రోడ్లకిరువైపులా ద్విచక్ర వాహనాలను పార్కింగ్ చేయడంతో వాహనాల రాకపోకలకు ఇబ్బందిగా ఉంటుంది. ట్రాఫిక్ సమస్యను నియంత్రించేందుకు పోలీసులు తగిన చర్యలు తీసుకోవడం లేదు. రోడ్లకిరువైపులా ఆక్రమణలు తొలగించాలని, ట్రాఫిక్ నిబంధనలపై ప్రజలకు అవగాహన కల్పించాలని, వ్యాపార సముదాయాల వద్దనున్న సెల్లార్‌లను వాహనాలకు పార్కింగ్‌లుగా మార్చాలని, పట్టణంలో ట్రాఫిక్ సమస్యను పరిష్కరించి వాహనాల రాకపోకలకు అంతరాయం కలగకుండా అధికారులు తగిన చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.



డీఆర్‌వో వినాయకంకు వినతి పత్రం అందజేస్తున్న కాలనీ వాసులు

### నివాస గృహాల మధ్య మద్యం దుకాణం తొలగించాలి

నరసరావుపేట టౌన్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): నివాస గృహాల మధ్య మద్యం దుకాణం తొలగించాలని పట్టణంలోని చిలకలూరిపేట రోడ్డులో ఉన్న ఆర్టీసీ కాలనీ వాసులు డిమాండ్ చేశారు. శుక్రవారం నరసరావుపేట కలెక్టర్ కార్యాలయంలోని రెవెన్యూ జిల్లా అధికారి కే వినాయకంకు వినతి పత్రం అందజేశారు. ఈసందర్భంగా కాలనీ వాసులు మాట్లాడుతూ పట్టణంలోని చిలకలూరిపేట రోడ్డులోని ఆర్టీసీ కాలనీ, ఎస్ఎస్ఆర్ డెవలపర్స్ వెంచర్‌ల వంద కుటుంబాలు నివాసం ఉంటున్నాయన్నారు. ఆర్టీసీ కాలనీకి వెళ్ళేదారిలో అంజనేయస్వామి ఆలయం ఉందన్నారు. ఆ దేవాలయం సమీపంలో మద్యం దుకాణం ఏర్పాటు చేశారన్నారు. దీంతో గుడికి వచ్చే భక్తులు, మహిళలు, ఇబ్బందులకు గురి అవుతున్నారని చెప్పారు. కార్యక్రమంలో పీ కోటేశ్వరి, సింధు చెంచులక్ష్మి, ఎస్‌కే అస్మ, వీ లక్ష్మీదుర్గ, ఎం మేరి, వై భారతి, ఎస్‌కే జిలానీ, పునుగుల శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

### దాడి కేసులో జరిమానా

నరసరావుపేట లీగల్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): దాడి కేసులో నేరం రుజువుకావడంతో నిందితుడు మండలంలోని ఉప్పలపాడుకి చెందిన గార్లపాటి శివనారాయణకు రూ.వేయి జరిమానా విధిస్తూ స్థానిక మొదటి అదనపు జూనియర్ సివిల్ జడ్జి కోర్టు ఇన్‌చార్జి న్యాయ అధికారి ఆర్.ఆశీర్వాదంపాల్ శుక్రవారం తీర్పు వెలువరించారు. ప్రాసిక్యూషన్ కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. నిందితుడు శివన్నారాయణ 2018 ఫిబ్రవరి 27న ఆస్తి వివాదాల నేపథ్యంలో అదే గ్రామానికి చెందిన వీర్లంకయ్యపై దాడి చేశారు. ఈ మేరకు ఫిర్యాదు చేశాడు. ఫిర్యాదు నమోదు చేసుకున్న పోలీసులు ప్రాథమిక దర్యాప్తు అనంతరం నిందితుడిని అరెస్టుచేసి కోర్టులో అభియోగపత్రం దాఖలుచేశారు. విచారణలో నేరం రుజువు కావడంతో పైవిధంగా కోర్టు తీర్పు వెలువరించింది. ప్రాసిక్యూషన్ ఏపీపీ లక్ష్మీరామ్ నాయక్ నిర్వహించారు.

### జరిమానా, జైలు శిక్ష

● దాడి కేసులో నేరం రుజువు కావడంతో నిందితుడు మండలంలోని గురువాయపాలెంకు చెందిన జొన్నలగడ్డ లేవియాకు ఏడాది జైలు, రూ.వేయి జరిమానా విధిస్తూ స్థానిక మొదటి అదనపు జూనియర్ సివిల్ జడ్జి కోర్టు ఇన్‌చార్జి న్యాయమూర్తి ఆర్ ఆశీర్వాదంపాల్ శుక్రవారం తీర్పు వెలువరించారు. ప్రాసిక్యూషన్ కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. గురవాయపాలెంకు చెందిన నిందితుడు లేవయ్య ఆస్తి వివాదాల నేపథ్యంలో 2018 సెప్టెంబరు 15న అదే గ్రామానికి చెందిన పాలెపోగు కోటిరత్నం అనే మహిళపై వెదురు బొంగుతో దాడిచేసి దూషించాడు. ఈ మేరకు ఫిర్యాదు నమోదు చేసుకున్న పోలీసులు ప్రాథమిక దర్యాప్తు అనంతరం నిందితుడిని అరెస్టు చేసి కోర్టులో అభియోగపత్రం దాఖలు చేశారు. విచారణలో నేరం రుజువుకావడంతో పైవిధంగా కోర్టు తీర్పు వెలువరించింది. ప్రాసిక్యూషన్ ఏపీపీ లక్ష్మీరామ్‌నాయక్ నిర్వహించారు.

### భార్య మృతికి కారకుడైన భర్తకు రిమాండ్

నరసరావుపేట లీగల్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): భార్య మృతికి కారకుడైన కేసులో నిందితుడైన పట్టణంలోని బీసీ కాలనీకి చెందిన భర్త షేక్ ఖాజాకు రిమాండ్ విధిస్తూ స్థానిక మొదటి అదనపు జూనియర్ సివిల్ జడ్జికోర్టు న్యాయమూర్తి ఆశీర్వాదంపాల్ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. నిందితుడి భార్య జానీ బేగం అతని వేధింపులు భరించలేక 2020 సంవత్సరంలో ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. ఈ మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు ప్రాథమిక దర్యాప్తు అనంతరం నిందితుడిని అరెస్టు చేసి కోర్టులో ప్రవేశపెట్టారు. నిందితుడికి రిమాండ్ విధిస్తూ న్యాయ అధికారి ఉత్తర్వులు జారీ చేశారు.

### ఆన్‌లైన్‌లో భూమిని తొలగించారంటూ ఫిర్యాదు

ఈపూరు, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): తనకు 7.73 ఎకరాల భూమి ఉందని, రీ సర్వే చేసి పట్టాదారు పాసుపుస్తకం ఇచ్చారని, అందులో కూడా అంతే భూమి ఉండగా ఆన్‌లైన్‌లో మాత్రం 0.39 సెంట్లు ఉందని రైతు కోంద్రు హనుమంతురావు రెవెన్యూ అధికారులకు ఫిర్యాదుచేశాడు. మండలంలోని చిట్టాపురంలో శుక్రవారం రీసర్వే రెవెన్యూ గ్రామసభ జరిగింది. పట్టాదారు పాసుపుస్తకాలు బ్యాంకులో పెట్టి పంట రుణాలు పొందామని ప్రస్తుతం ఆ భూములకు ఆన్‌లైన్‌లో అడంగులు, 1బీ రాకపోవడంతో బ్యాంకు అధికారులు రుణాలు పూర్తిగా చెల్లించాలని ఒత్తిడి తెస్తున్నట్లు రైతులు అధికారులకు విన్నవించుకున్నారు. అదేవిధంగా ఇనిమెళ్ళ మేజర్ కాలువను కి.మీ మేర రీసర్వే జరపాలని రైతులు అర్జీ పెట్టుకున్నారు. పంట కాలువలను పొలంలో కలుపుకున్నారని సర్వేచేసి కాలువను పునరుద్ధరించాలని కోరారు. కార్యక్రమంలో తహసీల్దారు నళిని, సర్పంచ్ గోనుగుంట్ల శ్రీనివాసరావు, వడ్లమూడి రాఘవయ్య, రెవెన్యూ అధికారులు, సర్వేయర్లు, వీఆర్వోలు పాల్గొన్నారు.

### జిల్లా పంచాయతీ అధికారులపై చర్యలు తీసుకోవాలి

నరసరావుపేట, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): అనేక అవకతవకలు.. అక్రమాలకు పాల్పడిన జిల్లా పంచాయతీ అధికారి విజయ భాస్కర రెడ్డిపై చర్యలు తీసుకోవాలని నవతరం పార్టీ అధ్యక్షుడు రావు సుబ్రమణ్యం డిమాండ్ చేశారు. ఈ మేరకు అయన సీఎం ముఖ్య కార్యదర్శి, పంచాయతీరాజ్ శాఖ కమిషనర్‌కు శనివారం వినతి పత్రాలు అందజేశారు. పంచాయతీ కార్యదర్శులపై జులుం ప్రదర్శిస్తూ అనేక ఇబ్బందులకు గురి చేస్తూ వారిని భయభ్రాంతులకు గురి చేస్తున్నారని పేర్కొన్నారు. పంచాయితీ తనిఖీల పేరుతో సిబ్బందిని భయభ్రాంతులకు గురి చేస్తున్నాడని వివరించారు.

### రోడ్డు ప్రమాదంలో గుర్తు తెలియని వ్యక్తి మృతి

నాదెండ్ల, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గణపవరం గ్రామ పరిధిలోని కుప్పగంజి వాగు సమీపంలో గురువారం అర్ధరాత్రి జరిగిన గుర్తు తెలియని వ్యక్తి ఒకరు మృతిచెందారు. గుంటూరు నుంచి చిలకలూరిపేట వెళ్ళే మార్గంలో చవిటిపాలెం డొంక వద్ద ఈ ప్రమాదం జరిగింది. గుర్తు తెలియని వాహనం ఆ వ్యక్తిపై నుంచి వెళ్ళటంతో ఒక చెయ్యి, తల నుజ్జు అయింది. జీన్స్ పాంట్, టీ షర్టు ధరించి ఆ వ్యక్తి వయస్సు సుమారు 30సంవత్సరాలు ఉంటుందని పోలీసులు తెలిపారు. ఆ వ్యక్తిది ఒరిస్సా రాష్ట్రం అయి ఉండవచ్చునని పోలీసులు అనుమానిస్తున్నారు. శుక్రవారం సాయంత్రం వరకు మృతుడి వివరాలు తెలియరాలేదు.




మాక్ పోలింగ్ నిర్వహిస్తున్న హెచ్ఎం, ఉపాధ్యాయులు

### మాక్ పోలింగ్‌తో ఎన్నికలపై విద్యార్థులకు అవగాహన

శావల్యాపురం, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): మాక్ పోలింగ్‌తో విద్యార్థులకు ఎన్నికల ప్రక్రియపై అవగాహన ఏర్పడుతుందని, చిన్నతనం నుంచే వారిలో నాయకత్వ లక్షణాలు మెరుగుపడతాయని హెచ్ఎం బొడ్డపాటి విజయలక్ష్మి అన్నారు. కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు దేశ్ అప్నాయెన్ సహయోగ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో శావల్యాపురం జడ్పీ పాఠశాలలోని 6వ తరగతి విద్యార్థులకు యాక్టిజెన్ క్లబ్ ద్వారా శుక్రవారం మాక్ పోలింగ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. మాక్ పోలింగ్‌లో అధ్యక్షురాలిగా కొత్తపల్లి మేఘన, ఉపాధ్యక్షురాలిగా అమృతపూడి ఆరాధ్యలను ఎన్నుకొన్నారు. హెచ్ఎం, ఉపాధ్యాయులు అధ్యక్షులు, ఉపాధ్యక్షులకు నియామకపత్రాలు అందజేసి వారిచే ప్రమాణ స్వీకారం చేయించారు. కార్యక్రమంలో స్టాఫ్ సెక్రటరీ బీవీ నాగేశ్వరరావు, ఉపాధ్యాయులు భువనేశ్వరి, గురుబాబు, శ్రీనివాసరాజు, వసంతరావు, శ్రీకాంత్ పాల్గొన్నారు.

### సచివాలయాల్లో సర్వీసుల సంఖ్యను పెంచాలి

● మండల ప్రత్యేకాధికారి, డీఎల్‌డీవో వెంకటరెడ్డి



శావల్యాపురం పీహెచ్‌సీలో రోగులతో మాట్లాడుతున్న డీఎల్‌డీవో వెంకటరెడ్డి

శావల్యాపురం, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): సచివాలయ ఉద్యోగులు ప్రజలకు నిరంతరం అందుబాటులో ఉంటూ సర్వీసుల సంఖ్యను పెంచాలని మండల ప్రత్యేకాధికారి, డీఎల్‌డీవో మూలె వెంకటరెడ్డి అన్నారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు మండలంలోని వేల్పూరు గ్రామ సచివాలయాన్ని ఆయన శుక్రవారం తనిఖీ చేశారు. సచివాలయంలో రికార్డులు, ఉద్యోగుల పనితీరు, సమయపాలన తదితర అంశాలను పరిశీలించారు. వేల్పూరు జడ్పీ పాఠశాలను సందర్శించి రిజిస్టర్లు, విద్యార్థుల సంఖ్య, మధ్యాహ్న భోజనం, ఉపాధ్యాయుల బోధన ప్రణాళికలు తదితర అంశాలను పరిశీలించారు. జడ్పీ పాఠశాలకు చుట్టూ ప్రహరీ నిర్మాణానికి గల సమస్యను తెలుసుకొని త్వరలో పరిష్కరించేందుకు కృషి చేస్తానన్నారు. అనంతరం శావల్యాపురం పీహెచ్‌సీని తనిఖీ చేశారు. ఓపీలు, ల్యాబ్ పరీక్షలు, ఆన్‌లైన్ నమోదు, సిబ్బంది పనితీరు తదితర అంశాలను పరిశీలించారు. పీహెచ్‌సీకి వచ్చిన రోగులతో మాట్లాడి వైద్యసేవలపై ఆరా తీశారు. కేంద్రప్రభుత్వం నిర్వహించిన సర్వేలో 92పాయింట్లతో పల్నాడు జిల్లాలో ప్రథమస్థానాన్ని, సర్వీస్‌ల్లో జిల్లాలో 5వ స్థానాన్ని సాధించడంతో సిబ్బందిని అభినందించారు. ఎంఈవో సాంబశివరావు, హెచ్ఎం సుభానీ, కార్యదర్శి యుగంధర్ పాల్గొన్నారు.

### ఘనంగా పల్లె పండుగ పంచాయతీ వారోత్సవాలు

శావల్యాపురం, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కారుమంచి, కొత్తలూరు, శానంపూడి, కనమర్లపూడి గ్రామాల్లో పల్లె పండగ పంచాయతీ వారోత్సవాలు కార్యక్రమాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. కొత్తలూరులో టీడీపీ మండలాధ్యక్షుడు, ఉప సర్పంచ్ గుంటూరు సాంబశివరావు, కారుమంచిలో టీడీపీ మాజీ మండలాధ్యక్షుడు యరమాసు కోటేశ్వరరావు, ఎంపీటీసీ యూనిట్ ఇన్‌చార్జి కోట హరిబాబు, మాజీ సొసైటీ అధ్యక్షుడు గోపాళం శివప్రసాద్ పాల్గొని అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన చేశారు. ఉపాధి హామీ పథకం ద్వారా కారుమంచిలో రూ.23 లక్షలు, కొత్తలూరులో రూ.10లక్షలు, శానంపూడిలో రూ.10 లక్షలు, కనమర్లపూడి రూ.8 లక్షలతో నూతనంగా చేపట్టనున్న సిమెంట్ రోడ్లు, డ్రెయిన్ నిర్మాణ పనులకు భూమిపూజ చేసి ప్రారంభించారు. ఎంపీడీవో సీతారామయ్య, ఏపీవో రామారావు, ఏపీఎం వాసుబాబు, పంచాయతీ రాజ్ ఏఈ వెంకటేశ్వరస్వామి, పంచాయతీ కార్యదర్శులు చింతా శ్రీనివాసరావు, ముంద్రు మనోహర్, టీడీపీ నేతలు తిరువీధి రవిశంకర్, దివ్యకోలు శ్రీనివాసరావు, మండలపు వెంకటనారాయణ తదితరులు పాల్గొన్నారు.

**గుండేపల్లిలో ...**

ఈపూరు, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గుండేపల్లి గ్రామంలో శుక్రవారం పల్లె పండగ కార్యక్రమం నిర్వహించారు. రూ.8లక్షల ఉపాధి హామీ పథకం నిధులతో నిర్మిస్తున్న సీసీ రోడ్డుకు గ్రామ సర్పంచ్ కే మల్లికార్జునరావు, ఉప సర్పంచ్ అబ్బూరి ఏడుకొండలు, ఏపీవో ఎం లక్ష్మణరావులు శంకుస్థాన చేశారు.

### వైసీపీలో సామాజిక న్యాయం ఏది..?

● టీడీపీ పల్నాడు జిల్లా అధ్యక్షుడు కొమ్మాలపాటి

నరసరావుపేట టౌన్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): వైసీపీ జిల్లా కో ఆర్డినేటర్ల నియామకాల్లో సామాజిక న్యాయం ఎక్కడ జగన్‌మోహన్‌రెడ్డి అని టీడీపీ పల్నాడు జిల్లా అధ్యక్షుడు కొమ్మాలపాటి శ్రీధర్ శుక్రవారం ఒక ప్రకటనలో ప్రశ్నించారు. ఎన్నికల ప్రచారంలో మాత్రం నా ఎస్సీ, నా బీసీ అంటూ ఊకదంపుడు ఉపన్యాసాలు ఇచ్చిన జగన్‌మోహన్‌రెడ్డి కో ఆర్డినేటర్ల నియామకలలో ఎస్సీ, బీసీ సామాజిక వర్గాలు కనిపించకపోవడం శోచనీయమన్నారు. ఉమ్మడి గుంటూరు, ప్రకాశంకు ఎంపీ మిథున్‌రెడ్డి, ఉమ్మడి చిత్తూరు, నెల్లూరుకు పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఉమ్మడి కృష్ణాకు ఆళ్ళ అయోధ్య రామిరెడ్డి, ఉమ్మడి ఈస్ట్, వెస్ట్ గోదావరిలకు బొత్స సత్యనారాయణ, ఉమ్మడి విశాఖ, శ్రీకాకుళంకు విజయసాయిరెడ్డి, కడప, అనంతపురం, కర్నూల్‌కు వైవీ సుబ్బారెడ్డిని నియమించారన్నారు. వైసీపీలో రెడ్డి సామాజికవర్గానికే అగ్ర తాంబూలమా అని ప్రశ్నించారు. ఎన్నికల సమయంలో ఊకదంపుడు ఉపన్యాసాలు చేసిన జగన్‌మోహన్‌రెడ్డికి ఇప్పుడు వారు కనిపించలేదా అన్నారు. ప్రాంతాల వారీగా తన సామాజిక వర్గానికి రాష్ట్రం మొత్తం పదవులు అప్పజెప్పి కేవలం ఓట్లు కోసం ఎస్సీ, ఎస్టీ, బీసీలను వాడుకుంటున్న జగన్‌మోహన్‌రెడ్డిని గురించి ఎస్సీ, ఎస్టీ, బీసీ ఆలోచించుకోవాలని శ్రీధర్ విజ్ఞప్తిచేశారు.

### ఎన్డీఏపై మాట్లాడే అర్హత జగన్‌కు లేదు: ఎమ్మెల్యే జీవీ

వినుకొండ, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): అధికారంలోకి వచ్చిన 125 రోజుల్లో 125 విజయాలు సాధించిన ఎన్డీఏ ప్రభుత్వంపై మాట్లాడే అర్హత మాజీ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికి లేదని ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు అన్నారు. మంగళగిరి తెలుగుదేశం పార్టీ కేంద్ర కార్యాలయంలో రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు ఆధ్వర్యంలో శుక్రవారం ఎమ్మెల్యేల సమావేశం ఏర్పాటుచేశారు. అనంతరం వినుకొండ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్రాన్ని రూ.14లక్షల కోట్లు అప్పుల్లో ముంచిన ఘనుడు ఇప్పుడు నీతులు మాట్లాడుతుంటే దెయ్యాలు వేదాలు వల్లించినట్లు ఉందని జీవీ జగన్‌పై ధ్వజమెత్తారు. ఇసుకలో వేలకోట్లు, మద్యంలో లక్షల కోట్లు దోచుకుని ప్యాలెస్‌ను నింపుకున్న జగన్, ఆరు నెలలు పూర్తికాని ఎన్డీఏ ప్రభుత్వంపై దిగజారుడు విమర్శలు చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

### రాష్ట్ర స్థాయి వాలీబాల్ పోటీలకు ఎంపిక



రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలకు ఎంపికైన విద్యార్థితో పాఠశాల ఇన్ చార్జి ప్రిన్సిపాల్ జ్యోతి, పీడీ రమణబాబు

వినుకొండ, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): వేజండ్లలో జరిగిన అండర్ 17 వాలీబాల్ పోటీల్లో వినుకొండ ప్రభుత్వ బాలుర పాఠశాలకు చెందిన టి.ఇమ్మానియేలు రాష్ట్ర స్థాయి వాలీబాల్ పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ జ్యోతి శుక్రవారం తెలిపారు. ఈ నెల 20వ తేదీన సత్యసాయి జిల్లా హిందూపురంలో జరిగే రాష్ట్ర పోటీల్లో పాల్గొంటారని ఆమె తెలిపారు. వాలీబాల్ పోటీల్లో ప్రతిభ చూపిన ఇమ్మానియేలుతో పాటు పీడీ కేవీ రమణబాబులకు ప్రత్యేక అభినందనలు తెలిపారు.

### ప్రారంభమైన రెవెన్యూ సదస్సులు

నాదెండ్ల, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో రైతులు ఎదుర్కొంటున్న భూ సమస్యలను పరిష్కరించేందుకే రెవెన్యూ గ్రామ సభలు నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ ఏవీ రమణ అన్నారు. మండలంలోని సాతులూరు గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద శుక్రవారం గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రీ సర్వేలో ఏమైనా పొరపాట్లు జరిగినట్లయితే భూ యజమానులు ఆ సమస్య పరిష్కరించేందుకు అర్జీలు ఇవ్వాలన్నారు. ఈ సందర్భంగా 32మంది రైతులు రీ సర్వేలో భూ విస్తీర్ణంలో వచ్చిన వ్యత్యాసాలపై అర్జీలను అందజేశారు. కాగా మరో మూడు సమస్యలకు సంబంధించి అర్జీలను అధికారులకు అందించారు. గ్రామ సభలో డిప్యూటీ తహసీల్దార్ ఎస్.ధనలక్ష్మి, సర్వేయర్ రాంబాబు, వీఆర్‌వోలు అంజలి, వీరయ్య తదితరులు పాల్గొన్నారు.


**కొండవీడులో...**

కొండవీడు (యడ్లపాడు), అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపేందుకు ప్రభుత్వం రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నదని తహసీల్దార్ విజయశ్రీ అన్నారు. రెవెన్యూ సదస్సులలో భాగంగా రెవెన్యూ అధికారులు మండలంలోని కొండవీడు గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద శుక్రవారం గ్రామసభను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ నెల 18 నుంచి నవంబరు 2 వరకు మండలంలోని 12 రెవెన్యూ గ్రామాలలో గ్రామాల వారీగా ఈ సదస్సులను నిర్వహిస్తున్నామన్నారు. రీసర్వే అనంతరం నష్టపోయిన రైతులు ఈ సదస్సులలో దరఖాస్తు చేసుకుంటే పరిశీలించి పరిష్కరించడం జరుగుతుందన్నారు. అనంతరం ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. విస్తీర్ణంలో వ్యత్యాసాలు, జాయింట్ ఎల్‌పీ నంబర్లు విభజన చేయాలని, మ్యుటేషన్, సర్వే తదితర అంశాలకు సంబంధించి 25అర్జీలు వచ్చినట్లు అధికారులు వెల్లడించారు. కార్యక్రమంలో డీటీ అనూరాధ, మండల సర్వేయర్ సురేంద్ర, వీఆర్వో కృష్ణచైతన్య, దేవదాయశాఖ ఈవో శివయ్య, ఎంపీటీసీ సభ్యులు మద్దూరి వీరారెడ్డి, శిలార్, ఫారెస్ట్, పంచాయతీరాజ్ అధికారులు పాల్గొన్నారు.

### రెండు గ్రామాలలో పల్లె పండుగ

యడ్లపాడు, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): పల్లె పండుగ కార్యక్రమంలో భాగంగా మండలంలోని గుత్తావారిపాలెం, యడ్లపాడు గ్రామాలలో అభివృద్ధి కార్యక్రమాలకు ఆయా గ్రామాలకు చెందిన టీడీపీ నాయకులు, అధికారులు శుక్రవారం భూమిపూజ నిర్వహించారు. యడ్లపాడులో ఎంజీఎన్ఆర్ఈజీఎస్ నిధులు రూ.2.3లక్షలతో నిర్మించనున్న క్యాటిల్ షెడ్ (పశువుల షెడ్)కు, గుత్తావారిపాలెంలో రూ.5లక్షలతో ఏర్పాటుచేయనున్న సీసీ రోడ్డుకు నాయకులు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఏపీవో మురళి మాట్లాడుతూ పశువులు, గొర్రెలు, కోళ్ళ పెంపకందారులు షెడ్లను నిర్మించుకునేందుకు ప్రభుత్వం అవకాశం కల్పించిందన్నారు. షెడ్ల నిర్మాణంలో 10శాతం లబ్ధిదారుని వాటా కాగా మిగిలిన 90శాతం సబ్సిడీగా ప్రభుత్వం అందిస్తుందన్నారు. ఆయా కార్యక్రమాల్లో మండల అభివృద్ధి అధికారి హేమలత, పంచాయతీ కార్యదర్శి శశికళ, టీఏ మాధవి, ఉపసర్పంచ్ గోనుగుంట్ల హరిబాబు, టీడీపీ నాయకులు పోపూరి రాఘవయ్య, వెంకయ్య, రామారావు, రత్తయ్య, నాగేశ్వరరావు, గోనుగుంట్ల రవికిరణ్ తదితరులు పాల్గొన్నారు.

### తెలుగు, ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో జ్ఞానశిఖకు స్థానం




సాధించిన రికార్డులను చూపుతున్న బేబీ అన్నా జ్ఞానశిఖ

వినుకొండ, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని గీతాంజలి పాఠశాలలలో రెండో తరగతి చదువుతున్న బేబీ అన్నా జ్ఞానశిఖ ఇండియా తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్, ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్స్ స్థానం సాధించినట్లు పాఠశాల ప్రిన్సిపాల్ తేళ్ళ కృష్ణ వేణి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ అన్నా జ్ఞానశిఖ అతి చిన్నవయసులో అత్యధిక హోలా స్పిన్స్ చేసిన బాలికగా బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో నమోదైందని, 60 సెకండ్ల సమయంలో 170 సార్లు హోలా రింగును స్పిన్ చేసి ఈ ఘనత సాధించిందన్నారు. ఈ సందర్భంగా చిన్నారి జ్ఞానశిఖను కరస్పాండెంట్ వై.ఎల్ కిషోర్, ఉపాధ్యాయులు, విద్యార్థులు అభినందించారు.

### విశ్వహిందూ మహా సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా శ్రీనివాసశర్మ

వినుకొండ, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పాత మార్కెట్ వద్ద ఉన్న శంకర్ మఠంలో విశ్వహిందూ మహా సంఘ్ భారత్ ఆధ్వర్యంలో శుక్రవారం ధర్మపరిరక్షణ సమావేశం నిర్వహించారు. సమావేశం అనంతరం విశ్వహిందూ మహా సంఘ్ జాతీయ్య అధ్యక్షుడు గోవిందరామానుజాచార్యులు సమక్షంలో విశ్వహిందూ మహా సంఘ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా పట్టణ పురోహితులు డాక్టర్ యడవల్లి శ్రీనివాస శర్మను ఏంపిక చేశారు. ఆదేవిధంగా పల్నాడు జిల్లా అధ్యక్షులుగా భాగవతుల రవికుమార్, కార్యదర్శిగా గజవల్లి నాగపవన్, మహిళా అధ్యక్షురాలిగా తెలగంశెట్టి పావని, నియోజకవర్గం మహిళా అధ్యక్షురాలిగా మాలపాటి సునీత, పురుషుల విభాగంలో నియోజకవర్గం అధ్యక్షుడిగా భవనాసి సాంబశివరావు, జిల్లా భజన మండలి అధ్యక్షుడిగా పారెళ్ల ప్రసాద్‌లను ఏకగ్రీవంగా ఎంపిక చేశారు.

### ప్రభుత్వ కార్యాలయాల్లో మండల ప్రత్యేక అధికారి తనిఖీ

యడ్లపాడు, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): యడ్లపాడు మండల ప్రత్యేక అధికారి బాలసుబ్రమణ్యం శుక్రవారం మండలంలోని కొండవీడులో పర్యటించారు. ముందుగా గ్రామ సచివాలయాన్ని సందర్శించి రికార్డులను తనిఖీ చేశారు. పెండింగ్‌లో ఉన్న అర్జీల వివరాలను పరిశీలించారు.